# కొనుగోలుదారు సంతోషమే వ్యాపారాభివృద్ధికి పునాది

## (19 మార్చి "అంతర్జాతీయ ఖాతాదారు లేదా కొనుగోలుదారు దినోత్సవం" సందర్భంగా)

వస్తు కొనుగోలు లేదా సేవలను పొందడమనే అంశానికి ఖాతాదారు లేదా కొనుగోలుదారు లేకుండా జరగదు. నేటి జిజిటల్ యుగపు ఈ-కామర్స్ లేదా ఈ-మార్కెటింగ్ ఉద్యమంలో ఖాతాదారు, వ్యాపార వేత్తల మధ్య సంబంధం మరో రూపును సంతరించుకుంటున్నది. ప్రపంచవ్యాప్త కొనుగోలుదారుల పాత్రను గమనించిన పౌర సమాజం 2010 నుంచి ప్రతి ఏట 19 మార్చిన "అంతర్జాతీయ ఖాతాదారు లేదా కొనుగోలుదారు దినోత్సవం (ఇంటర్నేషనల్ డే ఆఫ్ క్లయింట్స్)" పాటించడం ఆనవాయితీగా మారింది.

ప్రపంచవ్యాప్త 213కు పైగా కంపెనీలు వివిధ రకాల వస్తు విక్రయాలు, సేవలను అందిస్తున్నప్పటికీ వారి అందరి వ్యాపారాలకు ఊపిరిగా ఖాతాదారు లేదా కొనుగోలుదారు నిలుస్తున్నాడు. వ్యాపారంలో ముందుకు దూకుతున్న వ్యాపారస్తుల విజయం వెనుక రహస్యం కొనుగోలుదారు సంతృప్తి మాత్రమే అని రుజువు అయ్యింది.

కొనుగోలుదారుడి సిఫార్సు మాత్రమే వ్యాపారాభివృద్ధికి పునాది:

ఈ రోజున పాత ఖాతాదారులకు కృతజ్ఞతలు తెలపడం, సేవల్లో లోపం జరిగితే క్షమాపణలు కోరడం, కొనుగోలుదారుల అభిరుచులను తెలుసుకోవడం, ఖాతాదారుల సమస్యలను పరిష్కరించడం, ప్రత్యేక డిస్కౌంట్‌లను ఇవ్వడం, ఉచిత సేవలు అందించడం, ఖాతాదారు సంతృప్తి పడడం లాంటి కార్యక్రమాలు చేయవచ్చు. కొనుగోలుదారు సంతృప్తి మాత్రమే భవిష్యత్తు వ్యాపారానికి పెట్టుబడి అని తెలుసుకోవాలి. పాత ఖాతాదుల సిఫార్సుతోనే దాదాపు 68 శాతం కొత్త ఖాతాదారుల వస్తారని తెలుసుకోవాలి. మన కొనులుదారులే మనకు ప్రచార కార్యకర్తలుగా ఉపయోగపడతారు. మన పూర్వ ఖాతాదారులే మన నేటి 50 శాతం వ్యాపారాభివృద్ధికి దోహదపడతారు.

ఈ వ్యాపార రహస్యాలను తెలుసుకొని వ్యాపారవేత్తలు, మేనేజర్లు తమ పంథాను మార్చుతుంటూ ప్రస్తుత కొనుగోలుదారులకు సంతృప్తికర సేవలను అందిస్తూ వారి అభిమానాన్ని చూరగొనాలి. నేటి కొనుగోలుదారు రేపటి వ్యాపారాభివృద్ధికి పెట్టుబడి అని నిత్యం గుర్తుంచుకోవాలి. వ్యాపార సామ్రాజ్యాలు పాటించే నైతిక వ్యాపార సూత్రాలు మాత్రమే వారి వ్యాపార అభ్యున్నతికి ఊతం ఇస్తాయని మరువరాదు. వ్యాపార వేత్తలు, ఖాతాదారుల మధ్య ఆరోగ్యకర సంబంధాలు నెలకొన్నపుడు ఇరు పక్షాలకు మేలు కలుగుతుందని తెలుసుకోవాలి.



-డా॥బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# రైల్వేల ఆర్థిక పరిస్థితి బాగుంది, ప్రయాణీకులకు మరిన్ని రాయితీలు ఇస్తున్నాం: కేంద్ర రైల్వే మంత్రి

న్యూఢిల్లీ, మార్చి 18:రైల్వే మంత్రిత్వ శాఖ పనితీరుపై రాజ్యసభలో ఈ రోజు జరిగిన చర్చలో భాగంగా భారతీయ రైల్వేలు సాధిస్తున్న విజయాలు, భవిష్యత్తు ప్రణాళికల గురించి కేంద్ర రైల్వేలు, సమాచార-ప్రసారాలు, ఎలక్ట్రానిక్స్ - ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రి అశ్వనీ వైష్ణవ్ వివరించారు. భారతీయ రైల్వేలు ప్రయాణీకులకు అందుబాటు ధరల్లో నాణ్యమైన, సురక్షితమైన ప్రయాణాన్ని అందిస్తూనే, అంతర్జాతీయంగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్నాయని తెలిపారు. పొరుగు దేశాలైన పాకిస్థాన్, బంగ్లాదేశ్, శ్రీలంక కంటే భారత్‌లో రైల్వే ఛార్జీలు తక్కువగా ఉన్నాయని తెలిపారు. పాశ్చాత్య దేశాల్లో ఈ ధరలు 10 నుంచి 20 రెట్లు అధికంగా ఉన్నాయన్నారు.

రైలు ప్రయాణీకులకు అందిస్తున్న రాయితీ గురించి వివరిస్తూ, ప్రస్తుతం ఒక కి.మీ. దూరం రైలులో ప్రయాణించడానికి అయ్యే ఖర్చు రూ.1.38గా ఉంటే ప్రయాణీకుల నుంచి 73 పైసలు మాత్రమే వసూలు చేస్తున్నామని, అంటే ప్రయాణీకులకు 47 శాతం రాయితీ లభిస్తోందని తెలిపారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో ప్రయాణీకులకు అందించిన మొత్తం రాయితీ విలువ రూ. 57,000 కోట్లు. ఈ మొత్తం 2023-24 నాటికి రూ. 60,000 కోట్లకు (అంచనా) చేరుకుంది. తక్కువ ధరల్లో సురక్షితమైన, మెరుగైన సేవలు అందించాలన్నదే మా లక్ష్యం అని పేర్కొన్నారు.

రైల్వేల విద్యుద్దీకరణ వల్ల జరిగే ప్రయోజనాల గురించి వివరిస్తూ, ప్రయాణీకుల సంఖ్య, సరకు రవాణా పెరుగుతున్నప్పటికీ ఇంధన వ్యయం స్థిరంగా ఉందని కేంద్ర మంత్రి తెలిపారు. 2025 నాటికి 'స్కోప్ 1 నెట్ జీరో', 2030 నాటికి 'స్కోప్ 2 నెట్ జీరో' లక్ష్యాలను సాధించేందుకు రైల్వేలు కృషి చేస్తున్నాయి. బీహార్‌లోని మాధేపుర కర్మాగారంలో తయారయ్యే లోకోమోటివ్‌ల ఎగుమతులు త్వరలోనే ప్రారంభవుతాయని అన్నారు. మొజాంబిక్, బంగ్లాదేశ్, శ్రీలంక దేశాలకు ప్యాసింజర్ కోచ్‌లు, మొజాంబిక్, సెనెగల్, శ్రీలంక, మయన్మార్, బంగ్లాదేశ్ దేశాలకు లోకోమోటివ్‌లను భారతీయ రైల్వే ఎగుమతి చేస్తోంది. వీటితో పాటుగా, బోగీ అండర్ ఫ్రేములు యునైటెడ్ కింగ్‌డమ్, సౌదీ అరేబియా, ఫ్రాన్స్, ఆస్ట్రేలియాకు ఎగుమతి అవుతుండగా, చోదక భాగాలు ఫ్రాన్స్, మెక్సికో, జర్మనీ, స్పెయిన్, రొమేనియా, ఇటలీకి పంపిస్తున్నారు.

ఈ ఏడాది 1,400 లోకోమోటివ్‌లు భారత్‌లో తయారయ్యాయి. ఇది అమెరికా, ఐరోపాల మొత్తం ఉత్పత్తి కంటే ఎక్కువ. దీనితో పాటు అదనంగా 2 లక్షల కొత్త వ్యాగన్లను రైల్వేల్లో చేర్చారు. మార్చి 31తో పూర్తయ్యే ఈ ఆర్థిక సంవత్సరంలో భారతీయ రైల్వేలు 1.6 బిలియన్ టన్నుల సరకు రవాణా చేస్తాయని, తద్వారా ఈ అంశంలో చైనా, అమెరికాతో కలసి ప్రపంచంలోని మూడు అగ్ర దేశాల్లో ఒకటిగా భారత్ నిలువనుందని తెలిపారు. పెరుగుతున్న రైల్వేల సామర్థ్యానికి, రవాణా రంగంలో దాని ముఖ్యమైన పాత్రకు ఇది నిదర్శనమని అన్నారు.

రైల్వేల్లో భద్రత గురించి మాట్లాడుతూ, 41,000 ఎల్‌హెచ్‌బీ కోచులను సిద్ధం చేశామని, అన్ని ఐసీఎఫ్ కోచులను ఎల్‌హెచ్‌బీ కోచులుగా మారుస్తామని కేంద్ర మంత్రి శ్రీ అశ్వనీ వైష్ణవ్ వెల్లడించారు. రైలు పట్టాలు, ఎలక్ట్రానిక్ ఇంటర్‌లాకింగ్, పొగమంచు వల్ల ఎదురయ్యే ప్రమాదాల నుంచి రక్షణ కల్పించే పరికరాలు, కవచ్ వ్యవస్థలను త్వరితగతిన ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. గతంలో రైల్వేలకు రూ. 25,000 కోట్ల ఆర్థిక సాయం మాత్రమే లభించేదని, ఇప్పుడది రూ.2.5 లక్షల కోట్లకు చేరుకుందన్న శ్రీ వైష్ణవ్ తద్వారా మౌలిక సదుపాయాలను మెరుగుపరిచామని వివరించారు. ఈ అంశంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీకి ధన్యవాదాలు తెలిపారు. అలాగే స్వల్ప దూరాలకు ఏసీ, నాన్ ఏసీ ప్రయాణాన్ని అందించే 50 నమో భారత్ రైళ్లు తయారవుతున్నాయని తెలిపారు.

న్యూఢిల్లీ రైల్వే స్టేషన్లో ఇటీవల జరిగిన ప్రమాదంపై విచారణ జరిపేందుకు ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటు చేశామని కేంద్ర రైల్వే మంత్రి సభకు తెలిపారు. సీసీటీవీ ఫుటేజీ, డేటా మొత్తాన్ని భద్రపరిచామని, 300 మందితో మాట్లాడి వాస్తవాలను పరిశీలిస్తున్నామని అన్నారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు.

నిరుపేదల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి చెప్పారు. అందుకే ఏసీ కోచులతో పోలిస్తే సాధారణ కోచుల సంఖ్య 2.5 రెట్లు పెంచుతున్నామని తెలిపారు. ప్రస్తుత ఉత్పత్తి ప్రణాళిక ప్రకారం 17,000 నాన్ ఏసీ కోచులను తయారు చేసే అవకాశం ఉందని తెలిపారు. అలాగే భారతీయ రైల్వేల ఆర్థిక పరిస్థితి బాగుందని, అభివృద్ధి కోసం నిరంతర ప్రయత్నాలు జరుగుతున్నాయని మంత్రి వెల్లడించారు. కొవిడ్ సంక్షోభానికి సంబంధించిన సవాళ్లను రైల్వేలు విజయవంతంగా అధిగమించాయి. రైల్వేల్లో ప్రయాణీకుల సంఖ్యతో పాటు సరకు రవాణా కూడా పెరుగుతోంది. ప్రస్తుతం రైల్వేల ఆదాయం రూ. 2.78 లక్షల కోట్లు, ఖర్చులు రూ. 2.75 లక్షల కోట్లు. అన్ని ప్రధాన ఖర్చులను తన ఆదాయం నుంచే భరిస్తోంది. రైల్వేల మెరుగైన పనితీరు వల్లే ఇది సాధ్యమైంది. రాజ్యసభలో తన ప్రసంగాన్ని ముగిస్తూ.. భవిష్యత్తులో రైల్వేలు మరింత ఆధునికమైన, భద్రమైన, పర్యావరణహిత రవాణా వ్యవస్థగా మారుతుందని శ్రీ వైష్ణవ్ హామీ ఇచ్చారు.

# భారత ప్రధాని శ్రీ నరేంద్ర మోదీతో అమెరికా జాతీయ ఇంటెలిజెన్స్ డైరెక్టర్ గౌరవ తులసీ గబ్బార్డ్ భేటీ

న్యూఢిల్లీ, మార్చి 18:అమెరికా జాతీయ ఇంటెలిజెన్స్ డైరెక్టర్ గౌరవ తులసీ గబ్బార్డ్ ఈ రోజు భారత ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీతో భేటీ అయ్యారు.

గత నెలలో తన వాషింగ్టన్ డీసీ పర్యటనను, అధ్యక్షుడు ట్రంప్ తో అత్యంత ఫలవంతంగా సాగిన చర్చలను భారత ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ సంతోషంగా గుర్తు చేసుకున్నారు.

తన అమెరికా పర్యటన సందర్భంగా గౌరవ తులసీ గబ్బార్డ్ తో చర్చలను కూడా ప్రధానమంత్రి ప్రస్తావించారు.

రక్షణ, కీలక సాంకేతికతలు, ఉగ్రవాద నిరోధకత, అంతర్జాతీయ సవాళ్ల పరిష్కారం విషయాల్లో సహకారాన్ని బలోపేతం చేయడంలో ఆమె కీలక పాత్ర పోషిస్తున్నారని అభినందించారు.

అధ్యక్షుడిగా ట్రంప్ రెండో దఫా పదవీ కాలంలో అమెరికా నుంచి భారత్ కు తొలి జరిగిన పర్యటనగా. . ఆమె సందర్శన ఎంతో విశేషమైనదని ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు.

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కు భారత ప్రధానమంత్రి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ ఏడాదిలో అదీ సత్వరమే ఆయనను భారత్ కు స్వాగతించడం కోసం తనతోపాటు 140 కోట్ల మంది భారతీయులు ఎదురుచూస్తున్నారని చెప్పారు.

# యూజర్ సేఫ్టీ సామగ్రిని ఎక్కువ మంది చెంతకు చేర్చడానికి వీలుగా ప్రాంతీయ భాషలలో అనువాదం

న్యూఢిల్లీ, మార్చి 18:ఆన్‌లైన్ కుంభకోణాలు, స్పామ్.. వీటికి వ్యతిరేకంగా మెటా చేపట్టిన 'స్కాం సే బచో' (ఈ హిందీ మాటలకు కుంభకోణం బారి నుంచి రక్షణను పొందండి అని భావం) ప్రచార ఉద్యమ పరిధిని విస్తరించడానికి టెలికమ్యూనికేషన్ల విభాగం (డీఓటీ) వాట్సాప్‌తో జట్టు కట్టింది. ఈ సహకారంలో భాగంగా, డీఓటీ, వాట్సాప్.. డిజిటల్ సురక్షను, చైతన్యాన్ని పెంచడానికి అనుమానాస్పద మోసపూరిత కమ్యూనికేషన్లను గుర్తించే, వాటిని రిపోర్టు చేసే విషయంలో పౌరులకు మరింత ఎక్కువ అవగాహనను కలిగించేందుకు కలిసి పనిచేయనున్నాయి.

సైబర్‌నేరాలు, ఆర్థిక మోసాలకు పాల్పడే వారు టెలికాం వనరులను ఉపయోగించుకోవడాన్ని నిరోధించడానికి డీఓటీ అనేక కార్యక్రమాలను అమలు చేస్తోంది. పౌరులకు సేవ చేయడమే ప్రధానంగా సంచార్ సాథీ కార్యక్రమాన్ని ఒక పోర్టల్ రూపంలోను, ఒక మొబైల్ యాప్ రూపంలోను అభివృద్ధిపరిచింది. దీనివల్ల అనుమానాస్పద మోసపూరిత కాల్స్‌ను, సందేశాలను పౌరులు రిపోర్టు చేయగలగడం, వారి మొబైల్ కనెక్షన్ సమాచారాన్ని అందుకోవడంతోపాటు ఇతర సౌకర్యాలకు తోడు పోగొట్టుకున్న, లేదా దొంగతనానికి గురైన మొబైల్ హ్యాండ్‌సెట్లను బ్లాక్ చేయడంలోగాని, ట్రేస్ చేయడంలో గాని వారిని సమర్థులుగా తీర్చిదిద్దాలన్నదే ఈ కార్యక్రమం ధ్యేయం. డీఓటీలోని డిజిటల్ ఇంటెలిజెన్స్ ప్లాట్‌ఫామ్ (డీఐపీ) టెలికాం వనరుల దుర్వినియోగాన్ని గుర్తించడంతోపాటు ఆ దుర్వినియోగంపై తదనంతర చర్యలు తీసుకోవడానికి బ్యాంకులు, ఎల్ఈఏల వంటి 550 ఆసక్తిదారుల (స్టేక్‌హోల్డర్స్)కు డిజిటల్ రహస్య సమాచారాన్ని ఇవ్వడం, తాను కూడా అలాంటి సమాచారాన్ని పుచ్చుకోవడం చేస్తూవస్తోంది.

డిజిటల్ సురక్ష, క్షేత్ర స్థాయి అవగాహన.. ఈ రెంటినీ పెంపొందించే దిశగా వేసిన ఒక ముఖ్యమైన అడుగు అని చెప్పుకొనేటట్లు ఈ కార్యక్రమంలో డీఓటీ అధికారులు, 'సంచార్ మిత్ర'లు, టెలికాం సేవా ప్రదాత సంస్థలు (టీఎస్‌పీలు), క్షేత్ర విభాగాల కోసం 'ట్రయిన్-ది-ట్రయినర్' (శిక్షణనిచ్చే వ్యక్తిని తీర్చిదిద్దండి) తరహా వర్క్‌షాపులు ఓ భాగంగా ఉంటాయి. వాట్సాప్ సైతం 'సంచార్ సాథీ'ని మరింత మంది చెంతకు చేర్చే ఉద్దేశంతో తన ప్లాట్‌ఫాం ద్వారా సంచార్ సాథీ కార్యక్రమం అందిస్తున్న పౌర ప్రధాన సేవల పరిధిని విస్తరించే పద్ధతుల్ని అన్వేషించడానికి డీఓటీతో కలిసి పనిచేయనుంది.

కేంద్ర కమ్యూనికేషన్లు, ఈశాన్య ప్రాంత అభివృద్ధి శాఖ మంత్రి శ్రీ జ్యోతిరాదిత్య సింధియా తో మెటా చీఫ్ గ్లోబల్ అఫైర్స్ అధికారి శ్రీ జోయెల్ కప్లాన్ ఈ రోజు సమావేశమై కమ్యూనికేషన్ల విభాగం (డీఓటీ)కి, మెటాకు మధ్య ప్రస్తుతం కొనసాగుతున్న సహకారం ఎంత ప్రభావవంతంగా ఉందీ చర్చించారు. డీఓటీలోని డిజిటల్ ఇంటెలిజెన్స్ యూనిట్‌కు వాట్సాప్ సహకరిస్తుండడంతోపాటు సైబర్‌నేరాలకు, ఆర్థిక మోసాలకు ఒడిగట్టడానికి టెలికాం వనరులను దుర్వినియోగం చేస్తుండడంపై ముందస్తుచర్యలను చేపట్టడానికి డీఐపీ ద్వారా అందుకున్న సమాచారాన్ని సైతం ఉపయోగించుకొంటోంది.

భాగస్వామ్య విషయమై కేంద్ర కమ్యూనికేషన్లు, ఈశాన్య ప్రాంత అభివృద్ధి శాఖ మంత్రి శ్రీ జ్యోతిరాదిత్య సింధియా మాట్లాడుతూ, "భారత్ డిజిటల్ మార్పు మార్గంలో మునుముందుకు దూసుకుపోతున్న క్రమంలో, మా పౌరుల సురక్షకు, భద్రతకు పెద్ద పీట వేయడం మాకు అన్నింటి కన్నా ప్రాధాన్యం ఉన్న అంశం. మెటాతో మేం ఏర్పరచుకొన్న భాగస్వామ్యం మోసపూరిత కమ్యూనికేషన్లు, సైబర్ బెదరింపుల నుంచి మా ప్రజలను కాపాడాలన్న నిబద్ధతను బలపరుస్తుంది. వాట్సాప్‌కు ఉన్న విస్తృత డిజిటల్ మాధ్యమ పరిధి ప్రయోజనాల్ని వినియోగించుకొంటూ మేం మా డిజిటల్ అనుబంధ విస్తారిత వ్యవస్థ (డిజిటల్ ఇకోసిస్టమ్) అందరికీ సురక్షితంగా, ఎలాంటి ఆటుపోటులనైనా సరే తట్టుకొని దృఢంగా నిలదొక్కుకొనేటట్లు చూసే ప్రయత్నాలను పటిష్టపరుస్తున్నాం" అన్నారు.

మెటా చీఫ్ గ్లోబల్ అఫైర్స్ అధికారి శ్రీ జోయెల్ కప్లాన్ మాట్లాడుతూ, "కుంభకోణాలు, ఆన్‌లైన్ మోసాల బారిన పడకుండా ప్రజలను కాపాడడానికి అన్నిటి కన్నా మంచి పద్ధతి ఏదంటే వారు ఏయే విషయాలపైన దృష్టిని సారించాలో, సురక్షితంగా ఉండటానికి వారు ఏమేం చేయగలరనేది వారు తెలుసుకొనేటట్టుగా చూడడమే. ఈ కారణంగానే టెక్నాలజీ మీద, వనరుల మీద మెటా భారీ పెట్టుబడులు పెడుతోంది.. ఇలా చేస్తూ, మోసగాళ్ల కన్నా ఓ రెండడుగులు ముందే ఉండేందుకు ప్రయత్నిస్తుంటుంది. అదే సమయంలో ప్రజలకు వారికి అవసరపడే సమాచారాన్ని సైతం ఇస్తూ ఉంటుంది. డీఓటీతో కలిసి పనిచేయడం వల్ల, పౌరులకు సురక్షతను అందించాలన్న ప్రభుత్వ నిబద్ధతకు మేం మా సాంకేతిక ప్రావీణ్యాల్ని జోడించడానికి వీలు చిక్కడంతోపాటు భారతీయులకు వారు సురక్షితంగా ఉండడానికి అవసరమైన జ్ఞా?నాన్ని వారికివ్వడంలో కూడా మేం సహాయపడగలుగుతాం" అన్నారు.

డీఓటీతో జట్టు కట్టి సమాచార ప్రధాన సంపత్తులను వాట్సాప్ తాను కూడా తీర్చిదిద్దనుంది. దీంతో ఆన్‌లైన్ కుంభకోణాలను, స్పామ్‌ను గుర్తించడాన్ని, రిపోర్టు చేయడాన్ని యూజర్లకు నేర్పవచ్చు. వీటిలో 'సంచార్ సాథీ'పై లభ్యమవుతున్న వివిధ రకాల మోసాలు, హెచ్చరిక సంకేతాలు, రిపోర్టు చేసే విధానాలు కూడా ఓ భాగం అవుతాయి. గరిష్ఠ స్థాయి లభ్యత కోసం అన్ని విధాల యూజర్ సేఫ్టీ సామగ్రిని హిందీ, బెంగాలీ, మరాఠీ, తమిళం, తెలుగు, కన్నడం, మలయాళం, గుజరాతీ సహా ప్రాంతీయ భాషల్లోకి అనువాదం చేస్తారు.

అభివృద్ధిపరిచిన పరిష్కారాలను అమలుచేస్తూ వేర్వేరు ఆసక్తిదారులతో కలిసి పనిచేస్తూ టెలికాం వవనరుల దుర్వినియోగాన్ని అరికట్టడానికి డీఓటీ నిరంతర నిబద్ధతతో ముందుకు సాగుతోంది. అంతకంతకు మార్పులకు లోనవుతున్న డిజిటల్ అనుబంధ విస్తారిత వ్యవస్థలో పౌరుల్లో అవగాహనను కలిగించడం వల్ల వారి ప్రయోజనాలను కాపాడడంలో సహాయకారిగా ఉంటుంది.

# గత ప్రభుత్వ నిర్వాకంతోనే బుడమేరుకు వరదలు -మంత్రి నిమ్మల రామానాయుడు



అమరావతి, మార్చి 18:బుడమేరుకు సంబంధించి శాశ్వత పరిష్కారంపై దృష్టి పెట్టినట్లు తెలిపారు మంత్రి నిమ్మల రామానాయుడు. కేబినెట్ సమావేశంలో కూడా బుడమేరుపై చర్చ జరిగిందన్నారు. విపత్తుల నిర్వహణ ప్రకారం కేంద్ర సహకారం కూడా అవసరమని తెలిపారు. బుడమేరు పరిష్కారానికి కొన్ని ప్రతిపాదనలు ఉన్నాయని తెలిపారు.

ఏపీ అసెంబ్లీ సమావేశాలలో టిడిపి సభ్యులు సుజనా చౌదరి, వసంత కృష్ణ ప్రసాద్, యార్లగడ్డ వెంకట్రావులు మాట్లాడుతూ, బుడమేరు సమస్య పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకున్నారని . ఇదే పరిస్థితి కొనసాగితే బుడమేరుకు వరదలు మళ్ళీ రావడం, విజయవాడ మునగడం ఖాయమని అన్నారు. వాగులు, కాల్వల మరమ్మతులు వెంటనే చేయాలని వారు కోరారు. బుడమేరు ఆక్రమణలు అరికట్టి వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇప్పటి వరకు కనీసం బుడమేరుకు సంబంధించి మరమ్మతులు కూడా చేయాలేదని సభ్యులు వెల్లడించారు.

దీనికి నిమ్మల సమాధానం చెబుతూ, వెలగలేరు రెగ్యులేటర్ నుంచి ఎనికపాడు మీదుగా 10 వేల క్యూసెక్కుల తరలింపుపై దృష్టి పెట్టినట్లు చెప్పారు. ప్రస్తుతం తాత్కాలిక మరమ్మతులు చేయిస్తున్నామని పేర్కొన్నారు. గతంలో వైసీపీ ప్రభుత్వం బుడమేరు టెండర్లు రద్దు చేయకుండా ఉంటే విజయవాడకు ఈ పరిస్థితి వచ్చేది కాదన్నారు. బుడమేరు ముంపుకు వైసీపీ పాలనే కారణమన్నారు. గత టీడీపీ హయాంలోనే బుడమేరు డైవర్షన్ ఛానెల్ 37,500 క్యూసెక్కులకు పెంచేలా రూ.464 కోట్లతో టెండర్లు అప్పగించి 80 శాతం పనులు పూర్తి చేశామన్నారు. వైసీపీ ప్రభుత్వంలో బుడమేరు విస్తరణకు నిధులు ఉన్నా మిగిలిన 20 శాతం పనులకు సంబంధించి తట్ట మట్టిగానీ, బస్తా సిమెంట్ పని గానీ చేయలేదని విమర్శించారు. గత టీడీపీ హయాంలో ఎనికేపాడు యూటీ నుంచి కొల్లేరు వరకు వెళ్ళే ఛానల్ విస్తరణ పనులను వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిందని తెలిపారు. బుడమేరు గట్లు మరమ్మత్తుల కోసం 39.05 కోట్ల రూపాయలకు కేబినెట్ ఆమోదం తెలిపిందని.. త్వరలోనే టెండర్లు పిలిచి పనులు పూర్తిచేస్తామని చెప్పారు. బుడమేరు డైవర్షన్ కెనాల్‌ను 37,500 క్యూసెక్కులకు పెంచేలా పెండింగ్ పనులు పూర్తి చేయడానికి యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశామన్నారు.

వెలగలేరు రెగ్యులేటర్ నుంచి కొల్లేరు వరకు ఓల్డ్ ఛానెల్ సామర్థ్యాన్ని పెంచేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామన్నారు. బుడమేరు ఓల్డ్ ఛానెల్ కు సమాంతరంగా మరొక కొత్త ఛానెల్‌ను కూడా 10 వేల క్యూసెక్కుల సామర్థ్యంతో అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. బుడమేరు వరదల నియంత్రణకు డిజాస్టర్ మేనేజ్మెంట్ కింద కేంద్రం సహకారంతో ముందుకు వెళతామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు వారం రోజుల పాటు కలెక్టరేట్‌లోనే వార్ రూం ఏర్పాటు చేసి ప్రజలకు అందాల్సిన సహాయక చర్యలు, పునరావాస చర్యలను స్వయంగా పర్యవేక్షించారని మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడించారు.

# 15 మంది డిఎస్పీలకు పదోన్నతి

పెద్దపల్లి మార్చి 18: రాష్ట్రంలో పనిచేస్తున్న 15 మంది డిఎస్పి లకు అదనపు ఎస్పీలుగా పదోన్నతి కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి రవిగుప్త మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న 15 మంది డిఎస్పి లకు పదోన్నతి కల్పిస్తూ డిజిపి కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

# బీఆర్ఎస్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డిపై అట్రాసిటీ కేసు నమోదు

హైదరాబాద్, మార్చి 18: బీఆర్ఎస్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డిపై అట్రాసిటీ కేసు నమోదైంది. హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్ మీద అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు ఆయనపై ఎస్సీ-ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు ఎల్బీనగర్ పోలీసులు. క్రైమ్ నంబర్ 254/2025, ఎస్సీ/ఎస్టీ యాక్ట్ 1989 కింద కేసు నమోదు చేశారు. కాగా, ఈ వివాదం ప్రోటోకాల్ దగ్గర మొదలైంది. మార్చి 12న మన్సూరాబాద్ డివిజన్‌లో సుధీర్ రెడ్డి పలు డెవలప్‌మెంట్ వర్క్‌కు శంకుస్థాపన చేశారు.

ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి శంకుస్థాపన చేసిన అభివృద్ధి పనులకు మన్సూరాబాద్ బీజేపీ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి తిరిగి శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే చేసిన అనంతరం అవే పనులకు మళ్లీ కార్పొరేటర్ శంకుస్థాపన చేయడంపై బీఆర్ఎస్ కార్యకర్తలు సీరియస్ అయ్యారు. ఆ పనులను అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఆ తర్వాత అదే డివిజన్‌లో మరోచోట ఇలాగే శంకుస్థాపన చేసేందుకు ప్రయత్నించగా.. బీఆర్ఎస్ నేత జక్కిడి రఘువీర్ రెడ్డి నిరసన తెలిపారు. వాళ్లను అరెస్ట్ చేసిన పోలీసులు.. అబ్దుల్లాపూర్ మెట్ పీఎస్‌కు తరలించారు.

అరెస్ట్ టైమ్‌లో రఘువీర్‌తో పాటు పలువురు కార్యకర్తలకు స్వల్ప గాయాలయ్యాయి. దీంతో వాళ్లను పరామర్శించేందుకు అబ్దుల్లాపూర్ మెట్ పోలీసు స్టేషన్ వచ్చారు ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి. ఈ సందర్భంగా కాంగ్రెస్ నేత మధుయాష్కీ గౌడ్‌పై సీరియస్ అయ్యారు. బీఆర్ఎస్ నేతల మీద దాడుల వెనుక ఆయనే ఉన్నారని ఆరోపించారు. బీజేపీ కార్పొరేటర్లు కొప్పుల నర్సింహా రెడ్డి, వంగ మధుసూధన్ నడుమ హనీమూన్ నడుస్తోందన్నారు. హస్తినాపురం కార్పొరేటర్‌తోనూ హనీమూన్ నడుస్తోందని వ్యాఖ్యానించారు. ఈ కామెంట్స్‌ను కాంగ్రెస్ కార్పొరేటర్ సుజాత నాయక్ ఖండించారు. సుధీర్ రెడ్డి మీద అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఎల్బీనగర్ పీఎస్‌లో కంప్లయింట్ చేశారు.

# వాళ్లందర్ని లోపలేయండి - హోంమంత్రి అనిత

-పెనుగంచిప్రోలు దాడిపై హోంమంత్రి అనిత ఆగ్రహం
-ఘటన వివరాలపై ఉన్నతాధికారుల నుంచి ఆరా
-గాయపడిన సీఐకు మెరుగైన చికిత్స అందించాలని ఆదేశం

అమరావతి, మార్చి 18పెనుగంచిప్రోలు లక్ష్మీ తిరుపతమ్మ తిరుణాలలో జరిగిన గొడవపై హోంమంత్రి వంగలపూడి అనిత సీరియస్ అయ్యారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు పోలీసులపై రెచ్చిపోయి రాళ్లతో దాడిచేయడం పట్ల ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. వాటర్ ప్యాకెట్లు, బాటిళ్లు, రాళ్లు విసిరిన ఘటనలో పోలీసులకు, భక్తులకు గాయాలయ్యాయి. ఈ దాడి ఘటనకు కారణమైన వారందరిపై కేసులు నమోదు చేయాలని విజయవాడ సీపీ రాజశేఖర్ బాబుకు హోంమంత్రి ఆదేశించారు.

జగ్గయ్యపేట సీఐ వెంకటేశ్వర్లుకు తీవ్రగాయాలవడంపై అతని పరిస్థితిపై ఆరా తీశారు. నందిగామ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులకు మెరుగైన వైద్యసేవలందించేలా చూడాలని ఆమె ఆదేశించారు. అదుపు చేసి రక్షించాలనుకున్న పోలీసులని చూడకుండా దాడికి దిగితే సహించబోమని హోంమంత్రి అనిత తీవ్ర స్థాయిలో హెచ్చరించారు.

# మహేష్ బాబు ఔదార్యం..ఉచితంగా 4,500ల గుండె ఆపరేషన్‌లు చేయించిన సూపర్ స్టార్

-చిన్న పిల్లల గుండె సంబంధిత వ్యాధులకు ఉచితంగా చికిత్స
-విజయవాడలోని ఆంధ్ర హాస్పిటల్ సౌజన్యంతో కొనసాగుతున్న కార్యక్రమం
-మహేష్ కు అండగా సతీమణి నమ్రత ..




అమరావతి, మార్చి 18: గుండె సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న చిన్నారులకు సూపర్ స్టార్ మహేశ్ బాబు ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తోన్న విషయం తెలిసిందే. మహేశ్ బాబు ఫౌండేషన్ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. అయితే, ఈ సంఖ్య సోమవారంతో 4,500 దాటినట్లు ఆంధ్రా హాస్పిటల్స్ ప్రకటించింది. ఈ విషయాన్ని తెలియజేస్తూ ఘట్టమనేని ఫ్యాన్స్ సోషల్ మీడియాలో తెగ పోస్టులు పెడుతున్నారు. తమ అభిమాన హీరో చేస్తున్న సమాజ సేవ పట్ల వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అటు మహేశ్ బాబు అర్ధాంగి నమ్రతా శిరోద్కర్ ఏపీలో మదర్స్ మిల్క్ బ్యాంక్‌తో పాటు బాలికలకు ఉచితంగా గర్భాశయ క్యాన్సర్ టీకాను అందించే కార్యక్రమాన్ని తాజాగా ప్రారంభించారు. మహేశ్ బాబు ఫౌండేషన్ పిల్లల హార్ట్ ఆపరేషన్లను కొనసాగిస్తుందని ఈ సందర్భంగా ఆమె వెల్లడించారు.

# మేడిగడ్డ వ్యవహారం.. కేటీఆర్ పిటిషన్‌పై హైకోర్టులో విచారణ.. తీర్పు రిజర్వ్

హైదరాబాద్ మార్చి 18 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు దాఖలు చేసిన పిటీషన్‌పై తెలంగణ హైకోర్టులో ఇవాళ( మంగళవారం) విచారణ జరిగింది. మహాదేవ్‌పూర్ పీఎస్‌లో నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలంటూ కేటీఆర్ పిటిషన్ దాఖలు చేశారు. మేడిగడ్డ బ్యారేజీపై అనుమతి లేకుండా డ్రోన్ ఎగురవేశారంటూ కేటీఆర్‌పై కేసు నమోదైన విషయం తెలిసిందే. మేడిగడ్డ బ్యారేజీ నిషిద్ధ ప్రాంతమని పబ్లిక్ ప్రాసిక్యూటర్ తెలిపారు. బ్యారేజీపై డ్రోన్ ఎగురవేయడం వల్ల భద్రతకే ప్రమాదం ఏర్పడుతుందని పబ్లిక్ ప్రాసిక్యూటర్ చెప్పారు. మేడిగడ్డ బ్యారేజీని నిషిద్ధ ప్రాంతంగా రాష్ట్రం మాత్రమే నోటిఫై చేసిందని కేటీఆర్ తరఫు న్యాయవాది అన్నారు. నిషిద్ధ ప్రాంతంగా గుర్తిస్తూ కేంద్రం నుంచి నోటిఫికేషన్ వెలువడలేదని కేటీఆర్ న్యాయవాది తెలిపారు. ఫిర్యాదులో పేర్కొన్న అంశాల ప్రకారం కేవలం జరిమానాతో సరిపెట్టవచ్చని కేటీఆర్ న్యాయవాది చెప్పారు. రాజకీయ కక్ష్యల కారణంగానే పోలీసులు మరోసారి సెక్షన్లను మార్చారని కేటీఆర్ న్యాయవాది వివరించారు. పోలీసులు మార్చిన సెక్షన్లు ఈ కేసుకు సరిపోవని కేటీఆర్ న్యాయవాది చెప్పారు. సాక్ష్యులు ఇచ్చిన వాంగ్మూలాలన్నీ ఒకే విధంగా ఉన్నాయని కేటీఆర్ న్యాయవాది తెలిపారు. ఈ తీర్పును హైకోర్టు రిజర్వు చేసింది.

# అమరావతిలో బిట్స్.. స్పోర్ట్స్ యునివర్శిటీ - వెల్లడించిన నారా లోకేష్



-అమరావతిలో బిట్స్ - స్పోర్ట్స్ యునివర్శిటీ
-విశాఖలో డిప్ టెక్ వర్శిటీ
-కనిగిరిలో ట్రిపుల్ ఐఐటి
-ఎడ్యుకేషనల్ హబ్ గా ఎపిని తీర్చిదిద్దుతాం
-అసెంబ్లీలో ప్రకటించిన మంతి నారా లోకేష్

అమరావతి, మార్చి 18:దేశంలో పేరెన్నికగన్న బిట్స్ ను అమరావతిలో ఏర్పాటుకు 70 ఎకరాలు కేటాయిస్తూ ఇటీవల కేబినెట్ ఆమోదించామని, త్వరలోనే అక్కడ ఆ వర్శిటి తన కార్యకలపాలు ప్రారంభింనుందని మంత్రి నారా లోకేష్ తెలిపారు. టాటా గ్రూప్, ఎల్ అండ్ టీ, ఐఐటీ మద్రాసు, యూనివర్సిటీ ఆఫ్ టోక్యోతో కలిసి డీప్ టెక్ యూనివర్సిటీ చేయాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ప్రతిష్టాత్మక విద్యా సంస్థలను, వర్శిటీలను ఎపికి తీసుకురావాలని సీఎం చంద్రబాబు నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు.

ఆంధ్రప్రదేశ్ ప్రైవేటు విశ్వవిద్యాలయాల స్థాపన, క్రమబద్ధీకరణ సవరణ బిల్లు-2025ను నేడు మంత్రి నారా శాసనసభలో ప్రవేశపెట్టారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, . దేశంలో విదేశీ విశ్వవిద్యాలయాలను కేంద్రప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తోందన్నారు. వివిధ ఫారిన్ వర్సిటీల క్యాంపస్ లను రాష్ట్రానికి రప్పించాలన్నది సభ్యుల మనోగతంగా మంత్రి పేర్కొన్నారు. 2016లో ప్రైవేటు వర్సిటీల చట్టం తేవడం జరిగిందని, గత ప్రభుత్వం దీనికి 5 సవరణలు చేసిందన్నారు.

అవి యూజీసీ గైడ్ లైన్స్ కి విరుద్ధంగా ఉన్నాయన్నారు. గ్రీన్ ఫీల్డ్ వర్సిటీ ఏర్పాటు చేయాలంటే టాప్-100 గ్లోబల్ వర్సిటీతో జాయింట్ డిగ్రీ ఉండాలని నిబంధన విధించారు. ఈ విషయంలో యూజీసీ నిబంధనలు వేరుగా ఉన్నాయని మంత్రి తెలిపారు. పూర్తిస్థాయిలో చర్చించి, ఆ చట్టాన్ని సవరించాల్సి ఉందన్నారు. విశాఖలో ఏఐ వర్సిటీ, అమరావతిలో స్పోర్ట్ వర్సిటీ ఏర్పాటు చేయాలని భావిస్తున్నామన్నారు.

ఈ నేపథ్యంలో పలు ప్రైవేటు వర్సిటీలు ఎకనమిక్ డెవలప్ మెంట్ బోర్డుతో చర్చలు జరుపుతున్నాయని తెలిపారు. యూనివర్సిటీ ఆఫ్ టోక్యో, ఏఎంఈ వర్సిటీ ఫిలిప్పీన్స్ ఆసక్తి కనబర్చాయని చెప్పారు. ఇతర వర్సిటీల ప్రతినిధులు కూడా చర్చలకు వస్తున్నారన్నారు. పెద్ద ఎత్తున ప్రైవేటు రంగంలో భారత్ లో టాప్ వర్సిటీలతో పాటు విదేశీ యూనివర్సిటీలను ఏపీకి తెచ్చేవిధంగా ప్రోత్సహిస్తామని మంత్రి లోకేశ్ అన్నారు.

కవలం అమరావతి, విశాఖపట్నంకే కాకుండా అన్నిప్రాంతాలకు తెస్తామన్నారు. ఇన్సెంటివ్ లు అధికంగా ఇచ్చి రాయలసీమకు కూడా వర్సిటీలు రప్పించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. కనిగిరి ప్రాంతానికి ట్రిపుల్ ఐటీ ఏర్పాటు అంశాన్ని పరిశీలిస్తామన్నారు. ఆంధ్రకేసరి యూనివర్సిటీని 2022లో ఎటువంటి శాంక్షన్ పోస్టులు లేకుండా ప్రకాశం జిల్లాలో ఏర్పాటు చేసినట్లు చెప్పారు. దీనివల్ల ప్రొఫెసర్లు, సిబ్బంది కూడా ఇబ్బంది పడుతున్నారని మంత్రి పేర్కొన్నారు. ప్రభుత్వ యూనివర్సిటీల బలోపేతానికి దాతలు కూడా ముందుకు వస్తున్నారన్నారు. ఇందుకోసం ప్రత్యేకమైన మెకానిజం ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. ఆంధ్రకేసరి యూనివర్సిటీని కూడా అభివృద్ధి చేస్తామని చెప్పారు.

తెలుగుదేశం పార్టీ, కూటమి ప్రభుత్వం ఎప్పుడూ విద్యకు ప్రాధాన్యత నిస్తుందని మంత్రి లోకేశ్ తెలిపారు. ప్రధానంగా ఉన్నత విద్యకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వడం జరిగిందన్నారు. 2016లో ప్రైవేటు వర్సిటీల ఏర్పాటుకు ఒక ప్రత్యేక చట్టాన్ని ఆనాటి తెలుగుదేశం ప్రభుత్వం తీసుకువచ్చిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. చంద్రబాబు అభివృద్ధి వికేంద్రీకరణ జరగాలనే ఉద్దేశంతో విశాఖపట్నానికి సెంచురియన్ వర్సిటీ మంజూరు చేసి, 75 ఎకరాలు, 4.75లక్షల చదరపు అడుగుల్లో భవనాలు ఏర్పాటు చేశారని తెలిపారు. 23 ప్రోగ్రామ్ లలో 133 మంది అధ్యాపకుల ద్వారా 2,550 మంది విద్యార్థులు అక్కడ శిక్షణ పొందుతున్నారని చెప్పారు.

దీనికి అనుబంధంగా 8 సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్, 3 ఇంక్యుబేషన్ సెంటర్లు పనిచేస్తున్నాయన్నారు. ఇందుకు సంబంధించిన ట్రస్ట్ పరిధి ఒడిశాలో ఉండటంతో కొన్ని పాలనాపరమైన సమస్యలను వారు ఎదుర్కోవాల్సి వచ్చిందని, సకాలంలో నిధులు వారికి రాలేదని తెలిపారు. ఈ వర్సిటీ అభివృద్ధికి స్పాన్సరింగ్ బాడీగా ఏపీలో అనుమతి ఇవ్వాలని, ఇన్‌కం ట్యాక్స్ సీయూటీఎఫ్ ఏపీ కింద ఉంచాలని కోరారు. వర్సిటీలకు సంబంధించి సవరణ చేయాలంటే శాసనసభ, మండలికి మాత్రమే అధికారం ఉందన్నారు. అందుకే ఈ సవరణ బిల్లు ప్రతిపాదిస్తున్నామని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు.

విదేశీ విశ్వవిద్యాలయాలను అనుమతించండి - కొణతాల , బుచ్చయ్యచౌదరి

అంతకుముందుకు అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలోకి ప్రైవేటు విదేశీ విశ్వవిద్యాలయాలను అనుమతించే విషయమై పరిశీలించాలని కోరారు.మరో సభ్యుడు బుచ్చయ్యచౌదరి మాట్లాడుతూ రాష్ట్రం నుంచి లక్షలాది మంది విద్యార్థులు ఉన్నత విద్యకోసం ఇతర దేశాలు, ఇతర రాష్ట్రాలకు వెళ్తున్నారన్నారు. దీనివల్ల రాష్ట్ర సంపద కూడా పొరుగు రాష్ట్రాలకు తరలిపోతోందని తెలిపారు. కొన్ని వర్సిటీలు ఇక్కడ ఏర్పాటు చేసినా ఐటీ, జీఎస్టీ రిజిస్ట్రేషన్ వేరే ప్రాంతాల్లో ఉండటం వల్ల ఆదాయం అక్కడకు వెళుతోందన్నారు.ప్రైవేటు యూనివర్సిటీలు ఇంకా పెద్ద ఎత్తున రాష్ట్రానికి రప్పించేందుకు సబ్సిడీపై వారికి భూములు ఇవ్వాలని సూచించారు. మన రాష్ట్రంలో కూడా ప్రైవేటు రంగంలో పెద్ద ఎత్తున జాతీయ, అంతర్జాతీయస్థాయి వర్సిటీలను ప్రోత్సహించాలని కోరారు. కనిగిరి ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి మాట్లాడుతూ కనిగిరిలో ట్రిపుల్ ఐటీ విషయంలో గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని, తిరిగి ప్రారంభించాలని కోరారు. ప్రకాశం జిల్లాలో ఆంధ్రకేసరి యూనివర్సిటీని అభివృద్ధి చేయాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

# కోర్టును తప్పుదోవ పట్టించే ప్రయత్నం ..పిటిషనర్‌కు కోర్టు కోటి రూపాయిల జరిమానా

హైదరాబాద్ మార్చి 18 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: సాధారణంగా కోర్టు జరిమానా అంటే వేలల్లో ఉంటుంది. మరి ఎక్కువ అయితే.. అది లక్షల్లోకి ఉండే అవకాశం ఉంది. కానీ, కోర్టు కోటి రూపాయిలు జరిమానా విధించిందని వినడం చాలా అరుదు. అలాంటి సంఘటనే తెలంగాణ హైకోర్టులో చోటు చేసుకుంది. కోర్టును తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేసిన పిటిషనర్‌కు కోర్టు ఏకంగా కోటి రూపాయిల జరిమానా విధించింది. హైకోర్టులో ఒక పిటిషన్ పెండింగ్‌లో ఉండగా.. మరో బెంచ్‌కు వెళ్లిన పిటిషనర్‌కు జస్టిస్ నగేశ్ భీమపాక షాక్ ఇచ్చారు. ఇలా చేసి కోర్టును తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేసినందుకు పిటిషనర్‌పై ఆగ్రహం వ్యక్తం చేసిన ఆయన రూ.కోటి జరిమానా విధించారు. ఈ తీర్పుతో ఇది అత్యంత భారీ జరిమానాగా న్యాయవర్గాల్లో చర్చ జరుగుతోంది.

# టీటీడీకి రూ.1.23 కోట్ల విరాళం



తిరుపతి, మార్చి 18:టీటీడీకి చెందిన ఎస్వీ అన్నదానం, ఎస్వీ ప్రాణదానం, ఎస్వీ విద్యాదానం విభాగాలకు మంగళవారం రూ.1.23 కోట్లు విరాళం అందింది.

కర్నాటక రాష్ట్రం బళ్ళారికి చెందిన శ్రీనివాస కన్ స్ట్రక్షన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులు ఈ మేరకు డీడీలను తిరుమలలోని క్యాంపు కార్యాలయంలో టీటీడీ అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరికి అందజేశారు.

విరాళం వివరాలు ఇలా ఉన్నాయి.. రూ.1,01,11,111 విరాళాన్ని ఎస్వీ అన్నప్రసాదం ట్రస్ట్ కు, రూ.11,11,111 విరాళాన్ని ఎస్వీ ప్రాణదానం ట్రస్ట్ కు, రూ.11,11,111 విరాళాన్ని ఎస్వీ విద్యాదానం ట్రస్ట్ కు సదరు సంస్థ ప్రతినిధులు డీడీలను అందజేశారు. ఈ సందర్భంగా దాతలను టీటీడీ అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి అభినందించి సత్కరించారు.

# ప్రజా గొంతుకు ఆపడం ఎవరి తరం కాదు..మాజీ మంత్రి , ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి

హైదరాబాద్, మార్చి 18:ప్రజా గొంతుకనైన తనను ఆపేతరం ఎవరికి లేదని, ప్రజా సమస్యలపై 13వ ఏటా నుండే ఉద్యమాల్లో పాల్గొన్నానని మాజీమంత్రి సూర్యాపేట శాసనసభ్యులు గుంటకండ్ల జగదీష్ రెడ్డి అన్నారు మంగళవారం పెన్ పహాడ్ మండల పరిధిలోని దుబ్బ తండ, మెగ్యా తండా గ్రామాల్లోని ఎస్సారెస్పీ కాలువ కింద సాగుచేసి ఎండిపోయిన పంట పొలాలను ఆయన పరిశీలించారు. ప్రభుత్వానికి రైతుల గోడు పట్టడం లేదని మండిపడ్డారు. అసెంబ్లీలో రుణమాఫీ రైతు భరోసా, ఆత్మీయ భరోసా ఎన్నికలకు ముందు ప్రకటించిన ఆరు గ్యారంటీలతోపాటు 420 హామీలపై మాట్లాడినందుకే తనను సస్పెండ్ చేశారని చెప్పారు. కేసీఆర్ పాలనలో మండలం లోని చివరి భూముల వరకు కాళేశ్వరం జలాలను ఎస్సారెస్పీ కాలువల ద్వారా రెండు పంటలకు నీటిని అందించడం వల్ల అత్యధికంగా సాగు జరిగిందని చెప్పారు.

## ఎండిన పంటలు పరిశీలిస్తే అర్థమవుతుంది

ఎండిపోయిన పొలాలను రైతుల బాధలను స్వయంగా వచ్చి చూస్తే తప్ప సీఎం రేవంత్ రెడ్డి కి అర్థం కాదని జగదీష్ రెడ్డి అన్నారు. నోటికొచ్చిన మాట్లాడుతూ ప్రజల విశ్వాసాన్ని కోల్పోతున్నారని అన్నారు. ఈ



సందర్భంగా రైతులతో ముఖాముఖి మాట్లాడి గ్రామాలకు చెందిన రైతులు నునవత్ అఖిల్, ముఖ్య లింగ 10 ఎకరాల ఎండిపోయిన పంటలను పరిశీలించారు. ముఖ్యమంత్రి కి త్వరలోనే ప్రజలు బుద్ధి చెప్పే కాలం వస్తుందని అన్నారు. ఒక గొంతును మూయాలని ప్రయత్నం చేస్తే .. రాష్ట్రంలో వేల లక్షల గొంతుకలు ప్రభుత్వంపై తిరుగుబాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ గోపగాని వెంకట నారాయణ గౌడ్, మాజీ గ్రంథాలయ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్. మాజీ ఎంపీపీ నెమ్మాది బిక్షం. మండల పార్టీ అధ్యక్షులు దొంగరి యుగేందర్ . పిఎసిఎస్ చైర్మన్ వెన్న సీతారామరెడ్డి , నాయకులు భూముల ఇంద్రసే నారావు , మిర్యాల వెంకటేశ్వర్లు , బిట్టు నాగేశ్వరరావు, కొండేటి సుధాకర్, షేక్ షరీఫుద్దీ , నేమ్మాది నగేష్ బూఖ్య సైదా నాయక్, జతు నాయక్ రాధాకృష్ణ గోపి, సైదులుపాల్గొన్నారు.

# పీఎమ్ ఇంటర్న్‌షిప్ యాప్ ప్రారంభించిన ఆర్థిక మంత్రి శ్రీమతి నిర్మలా సీతారామన్

న్యూఢిల్లీ, మార్చి 18:ప్రైం మినిస్టర్స్ ఇంటర్న్‌షిప్ స్కీము కోసమే ప్రత్యేకంగా ఉద్దేశించిన ఒక మొబైల్ అప్లికేషన్ (యాప్)ను కేంద్ర ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీమతి నిర్మలా సీతారామన్ న్యూఢిల్లీలోని పార్లమెంటులోని సమన్వయ్ హాల్ నంబర్ 5లో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేట్ వ్యవహారాలు, రవాణా శాఖల సహాయ మంత్రి శ్రీ హర్ష్ మల్హోత్రా కూ?డా పాల్గొన్నారు.

ఉపాధిని, నైపుణ్యాల్ని, అవకాశాలను పెంచడానికి అయిదు పథకాలతో ఓ ప్యాకేజీని రంగంలోకి తెచ్చిన ప్రధానమంత్రి దార్శనికతను శ్రీమతి నిర్మలా సీతారామన్ ప్రశంసించారు. తరగతి గదిలో నేర్చుకొనే విషయాలకూ శ్రమశక్తి విషయంలో పరిశ్రమ పెట్టుకునే అంచనాలకూ నడుమ అంతరాన్ని భర్తీ చేయగల సత్తాతోపాటు దీని ద్వారా యువతలో ఉద్యోగాలు చేయడానికి కావలసిన శక్తియుక్తులను పెంచే దక్షత కూడా పీఎం ఇంటర్న్‌షిప్‌కు ఉందని ఆమె స్పష్టంచేశారు. ఈ పథకంలో ఉత్సాహంగా పాలుపంచ ుకోవాల్సిందిగా పరిశ్రమ వర్గాలకు మంత్రి విజ్ఞప్తి చేశారు. వారి ప్రమేయం దేశంలో చేయితిరిగిన సిబ్బందిని ప్రోత్సహిస్తూనే, మరో వైపు దేశ నిర్మాణానికి కూడా తోడ్పాటును ఇవ్వగలుగుతుందని ఆమె ప్రధానంగా ప్రస్తావించారు.

పీఎంఐఎస్ యాప్‌ను తీసుకుంరావడంతో యువతకు ఇంటర్న్‌షిప్ అవకాశాల్ని అందుకొనే వెసులుబాటు బాగా పెరుగుతుందని సహాయ మంత్రి శ్రీ హర్ష్ మల్హోత్రా అన్నారు.

ఈ పీఎంఐఎస్ అప్లికేషన్‌తో, యూజర్లు కార్పొరేట్ వ్యవహారాల శాఖ (ఎంసీఏ) ఇటీవలే ప్రకటించిన రెఫరల్ కార్యక్రమాన్ని గురించిన సమాచారాన్ని తెలుసుకోవచ్చు. ఈ రెఫరల్ కార్యక్రమం తమ పేర్లను నమోదు చేసుకొన్న యువతకు పథకానికి గాను ఇతర అర్హులైన అభ్యర్థులను సూచించేందుకు, అలా చేసి బహుమతులను గెలుచుకొనేందుకు వీలు కల్పిస్తుంది. ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ పోర్టల్ (వెబ్ బ్రౌజర్)లో నమోదు చేసుకొన్న యువతీయువకులు కూడా ఈ రెఫరల్ కార్యక్రమంలో పాలుపంచుకోవచ్చు.

ప్రైం మినిస్టర్స్ ఇంటర్న్‌షిప్ స్కీము (పీఎంఐఎస్)ను 2024-25 బడ్జెటులో ప్రకటించారు. అయిదు సంవత్సరాల్లో ఒక కోటి మంది యువతకు ఇంటర్న్‌షిప్ అవకాశాలను అందజేయాలన్నదే ఈ పథకం లక్ష్యం. ఈ పథకాన్ని మొదట 1.25 లక్షల ఇంటర్న్‌షిప్ అవకాశాలను అందించాలన్న ధ్యేయంతో 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను గతేడాది అక్టోబరు 3న ప్రారంభించారు. ఈ పథకం ముఖ్యాంశాలు ఇలా ఉన్నాయి:

భారత్‌లో అగ్రగామి కంపెనీలలో 12 నెలల పాటు చెల్లింపుతో కూడిన ఇంటర్న్‌షిప్‌లను కల్పించడం.

ఈ పథకం యువతకు వ్యాపారాల్లో గాని లేదా సంస్థలలో గాని (కనీసం 6 నెలల పాటు) శిక్షణను పొందేందుకు, అనుభవాన్ని, నైపుణ్యాన్ని సాధించేందుకు అవకాశాలను కల్పిస్తుంది. ఇది విద్యాసంబంధిత జ్ఞానార్జనకు, పరిశ్రమ రంగ అవసరాలకు మధ్య అంతరాన్ని భర్తీ చేయడంలో సహాయకారి అవుతుంది. అంతేకాకుండా ఉపాధి సంబంధిత ని ా వ ం ం ా ్య ని ౖ పెంపొందింపచేసుకోవడంలో కూడా తోడ్పడుతుంది.

ఈ పథకం 21ఏళ్లు మొదలు 24 ఏళ్ల వయస్సు గల వ్యక్తులను దృష్టిలో పెట్టుకొంటుంది. వారు ఇప్పటికే ఎలాంటి పూర్తి కాల విద్యాసంబంధిత పాఠ్యక్రమంలో చేరకుండా ఉండడం గాని, లేదా బతుకుతెరువును సంపాదించుకోవడం గాని చేయనివారై కూడా ఉండాలి. అలాంటి వారు వారి కెరియర్‌ను మొదలుపెట్టేందుకు ఒక అద్వితీయ అవకాశాన్ని ఈ పథకం అందిస్తుందన్నమాట.

ప్రతి ఇంటర్న్ (శిక్షణ పొందే అభ్యర్థి)కి నెలకు రూ.5,000 ఆర్థిక సహాయాన్ని ఇస్తారు. దీనికి అదనంగా రూ.6,000 ఏకమొత్తం ఆర్థిక సహాయాన్ని కూడా అందిస్తారు.

పైలట్ ప్రాజెక్టు ఒకటో దశలో (కిందటి ఏడాదిలో అక్టోబరు మొదలు డిసెంబరు దాకా) 25 రంగాల్లో దాదాపుగా 280 కంపెనీల్లో ఇంచుమించు 745 జిల్లాల వ్యాప్తంగా 1.27 లక్షల కన్నా ఎక్కువ అవకాశాలను నమోదు చేశారు. అభ్యర్థులకు 82,000కు పైగా ఆఫర్లను ఇచ్చారు.

పైలట్ ప్రాజెక్టు రెండో దశ ఈ ఏడాది జనవరిలో మొదలైంది. సుమారు 327 కంపెనీలు దేశమంతటా (కొత్త అవకాశాలకు తోడు ఒకటో దశలో ఖాళీగా మిగిలినవి కలుపుకొని) 1.18 లక్షల కన్నా ఎక్కువ అవకాశాలను ఇవ్వజూపాయి. వీటిలో నుంచి దాదాపు 37,000 అవకాశాలు పట్టభద్రుల కోసం కాగా 23,000 అవకాశాలు ఐటీఐ పూర్తి చేసిన వారికి, 18,000 అవకాశాలు డిప్లొమా హోల్డర్లకు, 15,000 అవకాశాలు 12వ తరగతి వారికోసం కాగా 25,000 అవకాశాలు 10వ తరగతి విద్యార్హత కలిగిన అభ్యర్థులకు అందుబాటులో ఉన్నాయి. ఆటోమొబైల్ రంగం, ప్రయాణం, ఆతిథ్య రంగం, బ్యాంకింగ్ , ఫైనాన్స్ రంగం వంటి విభిన్న రంగాలలో అవకాశాలతోపాటు వివిధ రకాల ఉద్యోగాలు.. ఉదాహరణకు విక్రయాలు, మార్కెటింగు వంటివి, ఐటీఐ ఉత్తీర్ణులకు సాంకేతికత ప్రధానంగా ఉన్న అవకాశాలు, మానవ వనరుల ఇంటర్న్‌షిప్, ఇలా మరెన్నో అవకాశాలను ఇవ్వజూపారు. ఈ అవకాశాలు దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని 735 జిల్లాల్లో లభిస్తున్నాయి.

పైలట్ ప్రాజెక్టు రెండో దశలో పీఎం ఇంటర్న్‌షిప్ పథకంలో చేరడాన్ని గురించిన అవగాహనను విస్తృతం చేసే ప్రయత్నాన్ని చేపట్టారు. పీఎంఐఎస్ పోర్టల్‌లో డ్యాష్‌బోర్డును సరళతరం చేస్తూ, దీనిని మరింత ఎక్కువ ఉపయోగానికి అనుకూలంగా ఉండేదిగా తీర్చిదిద్దారు. ఇవ్వజూపే అవకాశాలు, పోషించాల్సిన పాత్రలను గురించి మరింత సమాచారాన్ని ఇచ్చారు. కాలేజీలు, జాబ్ మేళాల వంటి వివిధ విద్యాసంస్థల్లో నిర్వహించిన 80కి పైగా అవుట్‌రీచ్ కార్యక్రమాల్లో పాల్గొన్న యువతీయువకులతో కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ (ఎంసీఏ), రాష్ట్ర ప్రభుత్వాలు, పరిశ్రమకు చెందిన భాగస్వామ్య సంస్థల అధికారులు మాట్లాడారు. పీఎంఐఎస్ రెండో దశలో ప్రయోగాత్మక (పైలట్) ప్రాజెక్టు అమలు తీరును అంచనా వేయడానికి, పీఎంఐఎస్‌కు సంబంధించిన కార్యాచరణలో రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు చేసే కృషిని గుర్తించడానికి, బహుమతులను ఇవ్వడానికి ఒక ఫ్రేంవర్కును రూపొందించారు.

# 100 కోట్లు విలువైన బంగారం పట్టివేత

అహ్మదాబాద్ మార్చి 18 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ): ఏటిఎస్ పోలీసులు, డిఆర్ఐ అధికారులు సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో ఏకంగా 100 కిలోల విలువైన బంగారాన్ని పట్టుకున్నారు. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో ఓ ఇంట్లో ఈ ఘటన చోటు చేసుకుంది. మార్కెట్‌లో దాని విలువ 100 కోట్లు ఉంటుందని అధికారులు తెలిపారు. భారీ ఎత్తున బంగారం అక్రమ రవాణ జరిగిందని పోలీసులకు సమాచారం అందింది. పాల్ది ప్రాంతంలోని ఆవిష్కార్ అపార్ట్‌మెంట్‌లో ఏటిఎస్ అధికారులు, పోలీసులు సోదాలు నిర్వహించగా.. 88 కిలోల బ్లంన 19.66 కిలోల ఆభరణాలు పట్టుకున్నారు. ఈ ఇల్లు గాంధీనగర్‌లోని ఓ వ్యక్తి పేరు మీద ఉంది. అతను ఆ ఇంటిని మహేంద్ర షా అనే స్టాక్ మార్కెట్ ఆపరేటర్‌కు అద్దెకు ఇచ్చినట్లు పోలీసులు పేర్కొన్నారు. ఈ బంగారంలో ఎక్కువ భాగం విదేశాల నుంచి అక్రమం తీసుకువచ్చినట్లు అంచనా వేస్తున్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలి.

## - హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య.

హన్మకొండ, మార్చి 18:(నేటి నిజం ప్రతినిధి)సమాజంలో ఆపదలో



ఉన్న వారికి దాతలు రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అన్నారు. మంగళవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని జిల్లా ఖజానా శాఖ కార్యాలయ ప్రాంగణం వద్ద తలసేమియా బాధితుల కోసం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. జిల్లా కలెక్టర్ ప్రావీణ్య రక్తదానం చేసి ఉద్యోగులకు, దాతలకు స్ఫూర్తిగా నిలిచారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తలసేమియా బాధితుల కోసం మంచి కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఆ రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసిన అధికారులకు కలెక్టర్ అభినందనలు తెలియజేశారు. రక్తదాతలకు కలెక్టర్ చేతుల మీదుగా ధ్రువపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, జిల్లా ఖజానా శాఖ అధికారి ఆకవరం శ్రీనివాస్ కుమార్, డిఆర్డిఓ మేన శ్రీను, బీసీ సంక్షేమ శాఖ అధికారి రామ్ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలు పరిష్కరిస్తా : ఎమ్మెల్యే కృష్ణారావు



హైదరాబాద్, మార్చి 18:స్నేహపురి కాలనీలో ప్రజా సమస్యలను పరిష్కరిస్తానని కూకట్‌పల్లి బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావును స్నేహపురి కాలనీ సంక్షేమ సంఘం నూతన కమిటీ సభ్యులు కలిశారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులను ఎమ్మెల్యే కృష్ణారావు సన్మానించారు.

కాలనీలో ఓపెన్ నాలా సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటారని, పలు ప్రజా సమస్యలను పరిష్కరిస్తానని తెలిపారు. కాలనీ అభివృద్ధి చేసేందుకు కమిటీ సభ్యులకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్ కుమార్, డివిజన్ టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్, వెంకటేశ్వర్ రెడ్డి, చలమారెడ్డి, శ్రీనివాస్, దశరథ్, మస్తాక్, వసీం, దిలీప్ తదితరులు ఉన్నారు.

# జమ్మూలోని వైష్ణోదేవి ఆలయంలో భద్రత వైఫల్యం

## -తనిఖీలు నిర్వహించే సిబ్బంది కళ్లుగప్పి తుపాకితో ఆలయంలోకి ప్రవేశించిన మహిళ

జమ్మూ మార్చి 18 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: జమ్మూలోని వైష్ణోదేవి ఆలయంలో భద్రత వైఫల్యం వెలుగు చూసింది. ఒక మహిళ తనిఖీలు నిర్వహించే సిబ్బంది కళ్లుగప్పి తుపాకితో ఆలయంలోకి ప్రవేశించింది.

ఈ నెల 15న జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇక మహిళ వద్ద ఆయుధాన్ని గుర్తించిన అధికారులు వెంటనే ఆమెను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఆమె వద్ద నుంచి తుపాకిని వారు స్వాధీనం చేసుకున్నారు. సదరు మహిళను ఢిల్లీ పిఎస్‌లో పని చేస్తున్న జ్యోతి గుప్తాగా పోలీసులు గుర్తించారు. గడువు ముగిసిన లైసెన్స్‌డ్ తుపాకిని ఆమె ఆలయంలోకి తీసుకువచ్చినట్లు, ఆమెపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలియజేశారు. ఈ ఘటన ఆలయానికి వచ్చే భక్తులను ఒక్కసారిగా ఉలికిపాటుకు గురి చేసింది. ఆయుధంతో ఆమె ఆలయంలోకి ప్రవేశించే వరకు భద్రత సిబ్బంది ఎవరూ దానిని గుర్తించకపోవడంపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని వారు కోరుతున్నారు.

# మహిళను చంపి ఆమె శరీర భాగాలను బెడ్‌షీట్‌లో మూటకట్టి..

అమరావతి మార్చి 18 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: ఓ మహిళను చంపి ఆమె శరీర భాగాలను బెడ్‌షీట్‌లో మూటకట్టి కల్వర్టు కిందపడేశారు. ఈ సంఘటన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనకాపల్లి జిల్లా కశింకోట మండలంలో జరిగింది.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బయ్యవరం గ్రామ శివారులో కల్వర్టు కింద ఓ బెడ్‌షీట్ లో మాంసపు ముద్దులు, రక్తపు మరకలు కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని బెడ్‌షీట్‌ను పరిశీలించగా ఓ మహిళ చేయి, కాళ్లు ఉన్నట్టు గుర్తించారు. మృతురాలి వయసు 40 ఏళ్లు ఉంటాయని పోలీసులు పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, వివిధ పోలీస్ స్టేషన్లలో మిస్సింగ్ కేసు వివరాలతో పాటు స్థానిక సిసి కెమెరాలను పరిశీలిస్తున్నామని సిఐ స్వామి నాయుడు పేర్కొన్నారు.

# కృష్ణా నదీ ప్రాజెక్టులపై లడాయి

## - కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు

న్యూఢిల్లీ, మార్చి 18:కృష్ణానదీ పరివాహక ప్రాజెక్టుపై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. ప్రాజెక్టులన్నీ కేఆర్ఎంబీకి అప్పగించాలంటూ 2021 జులై 15న కేంద్రం ఇచ్చిన నోటిఫికేషన్‌ను సవాల్ చేస్తూ తెలంగాణ వేసిన పిటిషన్‌ను ఈరోజు జస్టిస్ అభయ్ ఓకా, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌ల తో కూడిన ధర్మాసనం విచారించింది. అంతకు ముందు కృష్ణా నది ప్రాజెక్టుల నుంచి అనధికారికంగా విద్యుత్ ఉత్పత్తి చేస్తూ నీటిని వాడుకుంటున్నారని, అందుకు అనుగుణంగా తెలంగాణ జారీ చేసిన జీఓ రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ కూడా పిటిషన్ దాఖలు చేసింది. ఈ రెండు పిటిషన్‌లను కలిపి సుప్రీం ధర్మాసనం విచారణ చేపట్టింది.కృష్ణా నదీ ప్రాజెక్టుల అంశంపై తెలంగాణ రాష్ట్రం దాఖలు చేసిన రిట్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు ఈరోజు విచారించింది. రెండు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని కేంద్ర ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. కౌంటర్లు దాఖలైన వారం రోజుల్లో రిజాయిండర్ ఫైల్ చేయాలని కూడా ఆదేశించింది.

# అసెంబ్లీలో మా గొంతు నొక్కుతున్నారు! - హరీశ్‌రావు మండిపాటు



హైదరాబాద్, మార్చి 18:అసెంబ్లీలో ప్రశ్నోత్తరాలను రద్దు చేస్తూ జీరో అవర్ నిర్వహించడంపై మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీ లాబీలో చిట్ చాట్ చేశారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రజల సాక్షిగా అసెంబ్లీలో ప్రభుత్వం తమ గొంతు నొక్కుతోందని ఆరోపించారు. అదేవిధంగా విపక్షంలో తమతో పాటు ఉన్న ఎంఐఎం పార్టీకి కూడా మంత్రులను ప్రశ్నలు అడిగేందుకు కనీస అవకాశం ఇవ్వకపోవడం దారుణమని ఫైర్ అయ్యారు. ఇదే అంశంపై స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ను ప్రశ్నించినా.. ఆయన నుంచి సమాధానం లేకపోవడం ఆశ్చర్యంగా ఉందని కామెంట్ చేశారు.

**సభ్యుల హక్కులను కాపాడే బాధ్యత స్పీకర్‌దే**

సభ్యుల హక్కులను కాపాడే బాధ్యత స్పీకర్‌పైనే ఉందని.. ప్రశ్నోత్తరాల రద్దు చేయడంపై ఆయన వెంటనే సమాధానం చెప్పాలని హరీశ్‌రావు అన్నారు. మరోవైపు ప్రభుత్వం విడుదల చేసిన జీవోలను సైతం ఆన్‌లైన్ లో పెట్టాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతో రాష్ట్ర వ్యాప్తంగా పంటలు ఎండుతున్నాయని అన్నారు. హెచ్ఎండీఏ భూములను తాకట్టు పెట్టి మరో రూ.20 వేల కోట్లు అప్పు తెచ్చేందుకు సర్కార్ రెడీ అవుతోందని వాటిపై మాట్లాడేందుకు సభలో మాట్లాడేందుకు తమకు అవకాశం కల్పించడం లేదని హరీశ్ రావు ధ్వజమెత్తారు.

**సమాధానం చెప్పలేక పారిపోతున్న ప్రభుత్వం**

హరీశ్‌రావు మాట్లాడుతూ ప్రశ్నోత్తరాలు పై సమాధానం చెప్పలేక ప్రభుత్వం పారిపోతుందన్నారు. అందుకే ఈరోజు కీలకమైన ప్రశ్నోత్తరాలు ఉన్నాయి అని సమాధానం చెప్పలేక రద్దు చేసుకుందన్నారు. దీని పైన స్పీకర్‌కు, కార్యదర్శికి అభ్యంతరం చెప్పామన్నారు. ఈ ప్రభుత్వం హెచ్ఎండీఏ భూములు తాకట్టు పెట్టి 20 వేల కోట్లు అప్పు తెస్తున్నారని, టీజీ ఎఎసీ పది వేల కోట్లు, హెచ్ఎండీఏ ఆస్తులు కుదబెట్టి 20 వేల కోట్లు, హెచ్ఎండబ్ల్యూఎస్ 10 వేల కోట్లు, జీహెచ్ఎంసీ ఆస్తులను తాకట్టు పెట్టి 10 వేల కోట్లు అప్పులు తెచ్చేందుకు ప్రభుత్వం సిద్ధమైందన్నారు. తమ ప్రశ్నల పై సమాధానం చెప్పలేక మా గొంతు నొక్కే ప్రయత్నం చేస్తోందన్నారు. ఆంధ్ర జలదోపిడీ కారణంగా మహబూబ్ నగర్, నల్లగొండలో పంటలు ఎండిపోతున్నాయని, తమ ప్రభుత్వ హయాంలో 70 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని, ప్రస్తుత ప్రభుత్వం కేవలం 52 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొన్నది 24 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే అని అన్నారు. ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం పూర్తి విఫలమైందన్నారు. యాసంగి రైతు భరోసా ఇంతవరకు ఇవ్వలేదన్నారు. వరంగల్ జిల్లాలో దేవాదుల కింద పంటలు ఎండిపోతున్నాయని, మల్లన్న సాగర్, దుబ్బాకలో పంటలు ఎండిపోతున్నాయని అన్నారు. ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పలేక ప్రశ్నోత్తరాలు రద్దు చేశారన్నారు.

# ప్రపంచ స్థాయి నగరంగా ఫ్యూచర్ సిటీ - మంత్రి శ్రీధర్ బాబు



హైదరాబాద్, మార్చి 18:ప్రస్తుతం దేశంలో ప్రణాళికాబద్ధమైన నగరం అనగానే చండీగఢ్ గుర్తుకు వస్తుందని రాబోయే రోజుల్లో హైదరాబాద్‌ను కూడా అటువంటి నగరంగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం సంకల్పించిందని ఐటీ , శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు అన్నారు. మంగళవారం శాసనసభలో ఆయన మాట్లాడారు. శంషాబాద్ విమానాశ్రయం ఓఆర్ఆర్ (ఔటర్ రింగ్ రోడ్) ను కేంద్రంగా చేసుకుని పట్టణీకరణ వేగంగా జరుగుతోందని ఈ నేపథ్యంలో సుస్థిర అభివృద్ధి లక్ష్యంగా "ఫ్యూచర్ సిటీ" పేరిట ప్రత్యేక నగరాన్ని అన్ని హంగులతో నిర్మించేందుకు ప్రణాళికలు రూపొందించామన్నారు. హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్ కు ధీటుగా ఈ ఫ్యూచర్ సిటీని ప్రపంచ స్థాయి నగరంగా అభివృద్ధి చేస్తామన్నారు. ఈ ఫ్యూచర్ సిటీ పరిధి రంగారెడ్డి జిల్లాకు చెందిన ఏడు మండలాల్లోని 56 రెవెన్యూ గ్రామాల పరిధిలోని 770 చ.కి.మీల విస్తీర్ణంలో విస్తరించి ఉంటుందని వెల్లడించారు. ఫ్యూచర్ సిటీని అన్ని సదుపాయాలతో ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేసేందుకు "ఫ్యూచర్ సిటీ డెవలప్మెంట్ అథారిటీ"ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఫ్యూచర్ సిటీ తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు దన్నుగా నిలిచి, రాష్ట్రాభివృద్ధికి, పరిశ్రమల ఏర్పాటు, ఉద్యోగాల కల్పనకు తోడ్పడుతుందన్నారు.

**దుమారం రేపిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు వ్యాఖ్యలు**

మండలిలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. ఫోర్త్ సిటీ కాదు, ఫోర్ బ్రదర్స్ సిటీ కడుతున్నారని శంభీపూర్ రాజు అన్నారు. ఈ వ్యాఖ్యలపై మంత్రి శ్రీధర్ బాబు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇలాంటి వ్యాఖ్యలు తగవన్నారు. దాంతో తాను ఎవరి పేరు తీసుకోలేదని, శాసనసభలో అంతకన్నా దారుణంగా వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. మండలి చైర్మన్ కలుగు చేసుకుని ఇక్కడ అలాంటివి మాట్లాడొద్దు అని సూచించారు. ఇక్కడ ఓ రూల్, ఓ పద్ధతి ఉందని, దాని ప్రకారమే మాట్లాడాలని సూచించారు. అనంతరం మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ శంభీపూర్ రాజు శాసనసభకు రావాలని అక్కడ ఆ రకమైన సమాధాం చెబుతామన్నారు. ఇది పెద్దల సభ? ఇది ఆదర్శప్రాయంగా ఉండాలని కోరుకుంటున్నానన్నారు.

# వారధిగా ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి : ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి



హైదరాబాద్, మార్చి 18: ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా ప్రభుత్వానికి, ఉద్యోగ ? ఉపాధ్యాయ- పెన్షనర్ల సంఘాలకు మధ్య వారధిగా ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్లు ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి తెలిపారు. కోదాడ పట్టణంలోని పబ్లిక్ క్లబ్ ఆడిటోరియంలో గత మూడు రోజులుగా కొనసాగిన విశ్రాంత ఉద్యోగుల రాష్ట్రస్థాయి క్రీడా, సాహిత్య, సాంస్కృతిక పోటీలు మంగళవారం ముగిశాయి. విజేతలకు బహుమతుల ప్రధానోత్సవం కార్యక్రమానికి ఎమ్మెల్సీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల నుండి వయస్సుతో సంబంధం లేకుండా క్రీడలకు హాజరైన విశ్రాంత ఉద్యోగులు అభినందనీయులన్నారు.

ఆహ్లాదకర వాతావరణంలో కొనసాగిన క్రీడలు, సాంస్కృతిక పోటీలు చారిత్రాత్మకంగా నిలుస్తాయన్నారు. పెండింగ్ డీఏలు పీఆర్సీ సర్వీస్ రూల్స్, ప్రధానంగా హెల్త్ కార్డులు సాధించే బాధ్యత తనదేనన్నారు. హక్కుల సాధన కోసం అవసరమైతే జరిగే ఉద్యమ కార్యాచరణకు ముందుంటానన్నారు. పాలకవర్గాలు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అన్ని చేస్తామంటాయని అధికారంలోకి రాగానే పరిస్థితులను బట్టి వ్యవహరిస్తుంటాయన్నారు. గతంలో పీఆర్టీయూ అధ్యక్షుడిగా ఉండి పెన్షనర్ల క్వాంటం పింఛన్ పై ముఖ్యమంత్రితో మాట్లాడి పింఛన్‌దారులకు లబ్ది చేకూర్చినట్లు తెలిపారు. ఎంప్లాయిస్ జేఏసీ పక్షాన హక్కుల కోసం కృషి చేసినట్లు చెప్పారు.

ప్రస్తుతం తాను ఒక రిటైర్డ్ ఉద్యోగినేనని విశ్రాంత ఉద్యోగులకు అండగా ఉంటానన్నారు. రాష్ట్రస్థాయిలో విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు రావెళ్ల సీతారామయ్య క్రీడలు నిర్వహించి కోదాడకు రాష్ట్ర స్థాయిలో గుర్తింపు తెచ్చారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు దామోదర్ రెడ్డి, టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి సీహెచ్ లక్ష్మీనారాయణరెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవీటి రామారావు, కోదాడ యూనిట్ అధ్యక్షుడు వేనేపల్లి శ్రీనివాసరావు, రాష్ట్ర జనరల్ సెక్రెటరీ చంద్రశేఖర్, రాష్ట్ర మహిళా ఉద్యోగుల చైర్మన్ ఉమా, విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సుదర్శన్ రెడ్డి, బొల్లు రాంబాబు, పీఆర్టీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జితేందర్ రెడ్డి, తీగల నరేశ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ టి.వీరబాబు, భ్రమరాంబ, రఘు పాల్గొన్నారు.

# తిరుమల వెళ్లే భక్తులకు అలెర్ట్.. ఈ రెండురోజుల్లో వీఐపీ దర్శనాలకు బ్రేక్..!

తిరుపతి, మార్చి 18: తిరుమల శ్రీవారి ఆలయంలో ఈ నెల 30న ఉగాది పండుగ సందర్భంగా మార్చి 25న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నారు.

ఈ సందర్భంగా మంగళవారం శ్రీవారి ఆలయంలో నిర్వహించనున్న అష్టదళ పాదపద్మారాధన సేవను తిరుమల తిరుపతి దేవస్థానం రద్దు చేసింది. అలాగే, మార్చి 30న ఆదివారం ఉగాది ఆస్థానం సందర్భంగా సహస్ర దీపాలకరణ సేవ మినహా అన్ని సేవలను రద్దు చేసినట్లు పేర్కొంది.

ఈ క్రమంలో మార్చి 25, 30 తేదీల్లో ప్రోటోకాల్ పరిధిలోని వీఐపీలకు మాత్రమే బ్రేక దర్శనాలు కల్పించనున్నట్లు పేర్కొంది. ఈ నెల 24, 29వ తేదీల్లో వీఐపీ బ్రేక్ దర్శనాలకు సంబంధించి ఎలాంటి సిఫారసు లేఖలను స్వీకరించబోమని స్పష్టం చేసింది. ఈ విషయాన్ని భక్తులు దృష్టిలో ఉంచుకొని సహకరించాలని దేవస్థానం కోరింది.

# పాడ్ క్యాస్ట్‌లో లెక్స్ ఫ్రిడ్మాన్‌తో ప్రధాని సంభాషణకు తెలుగు అనువాదం

న్యూఢిల్లీ, మార్చి 18:ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈరోజు పాడ్ క్యాస్ట్ ద్వారా లెక్స్ ఫ్రిడ్మాన్తో జరిపిన సంభాషణలో అనేక అంశాల గురించి ముచ్చటించారు. ఆత్మీయంగా జరిగిన సంభాషణలో భాగంగా ఉపవాసాలు ఎందుకు చేపడతారు, నిరాహారంగా ఉండటం ఎలా సాధ్యం అన్న ఫ్రిడ్మాన్ ప్రశ్నకు సమాధానమిస్తూ, తన ఉపవాస దీక్షకు గౌరవ సూచకంగా ఫ్రిడ్మాన్ కూడా ఉపవాసాన్ని చేపట్టినందుకు ప్రధాని కృతజ్ఞతలు తెలిపారు. "భారతదేశంలో మతపరమైన ఆచార వ్యవహారాలు నిత్య జీవితంతో పెనువేసుకుని ఉంటాయి." అని తెలియజేస్తూ, హిందూ మతం కేవలం ఆచార వ్యవహారాలకే పరిమితం కాదని, దేశ అత్యున్నత న్యాయస్థానం వివరించినట్టు జీవితానికి దిశానిర్దేశం చేసే సిద్ధాంతమని వెల్లడించారు. ఉపవాసం వల్ల క్రమశిక్షణ అలవడుతుందని, మనస్సు, శరీరాల మధ్య సమన్వయం మెరుగవుతుందని చెప్పారు.

ఉపవాస సమయంలో ఇంద్రియాలన్నీ చురుకుగా మారతాయని, దాంతో పరిసరాల పట్ల అవగాహన పెరుగుతుందని చెబుతూ, ఆ సమయంలో సున్నితమైన వాసనలను కూడా స్పష్టంగా తెలుసుకోగలుగుతామని చెప్పారు. ఉపవాసం ఆలోచనల పదును పెంచి, కొత్త దృక్పథాలను, విలక్షణమైన యోచనలను ప్రేరేపిస్తుందని చెప్పారు. ఉపవాసం అంటే కేవలం ఆహారానికి దూరంగా ఉండటమే కాదని, శాస్త్రీయ విధానమనీ, శరీరంలోని విషాలను బయటకు పంపే ప్రక్రియ అని చెప్పారు. ఉపవాసం చేపట్టే కొద్దిరోజుల ముందు నిర్దిష్టమైన ఆయుర్వేద, యోగా పద్ధతులను పాటించడం ద్వారా తన శరీరాన్ని సిద్ధం చేసుకుంటానని, ఆ సమయంలో నీరు అధికంగా తాగడం ద్వారా శరీరంలో తగినంత నీరు ఉండేలా జాగ్రత్త తీసుకుంటానని శ్రీ మోదీ వెల్లడించారు. తదనంతరం మొదలపెట్టే ఉపవాసాన్ని భక్తి, క్రమశిక్షణలకు అంకితమయ్యే సమయంగా భావిస్తానని, లోతైన చింతనకు, సంపూర్ణమైన దృష్టి కేంద్రీకరణకు వెచ్చిస్తానని చెప్పారు. తాను పాఠశాల విద్యార్థిగా ఉన్న సమయంలో జరిగిన ఒక సంఘటన వల్ల, మహాత్మా గాంధీ ఉద్యమం వల్ల ఉపవాసాలను అలవాటు చేసుకున్నానని శ్రీ మోదీ వెల్లడించారు. తొలిసారి ఉపవాసం చేసినప్పుడు శక్తి, అవగాహనలు పెరిగిన భావన కలిగిందని, దాంతో ఈ ప్రక్రియ వల్ల పరివార్తనాత్మక శక్తి అనుభవంలోకి వచ్చిందని చెప్పారు. ఉపవాసం తనని మందకొడిగా చేసే బదులు తనలో వేగాన్ని, చురుకునీ, సామర్థ్యాన్ని పెంచుతుందన్నారు. దీక్ష సమయంలో తన ఆలోచనలు వేగంగా సాగుతాయని చెబుతూ ఉపవాసాన్ని మెరుగైన సృజన ద్వారా తన భావనలను పంచుకునే దివ్యమైన అవకాశంగా భావిస్తానని ప్రధాని అన్నారు.

ఉపవాసాలు, కొన్నిసార్లు తొమ్మిది రోజుల పాటు కొనసాగే దీర్ఘ ఉపవాసాలతో ప్రపంచ వేదికపై నాయకుడిగా తన పాత్రను ఎలా నిర్వర్తించగలుగుతారని అడిగినప్పుడు, శ్రీ మోదీ ప్రాచీన భారతీయ సంప్రదాయమైన చాతుర్మాస దీక్ష గురించి ప్రస్తావించారు. వర్షాకాలంలో జీర్ణక్రియ సహజంగానే మందగిస్తుందని, ఆ సమయంలో చాలా మంది భారతీయులు రోజుకు ఒక పూట మాత్రమే భోజనం చేసే విధానాన్ని అనుసరిస్తారని వ్యాఖ్యానించారు. ఈ సంప్రదాయం జూన్ మధ్యలో ప్రారంభమై నవంబర్లో దీపావళి తర్వాత వరకూ ? అంటే, దాదాపు నాలుగు నుండి నాలుగున్నర నెలల వరకు కొనసాగుతుందని చెప్పారు. సెప్టెంబర్ లేదా అక్టోబరులో నిర్వహించే దసరా పండుగ సమయంలో, శక్తి, భక్తి క్రమశిక్షణకు మారుపేరైన నవరాత్రి పర్వదినాల తొమ్మిది రోజుల పాటూ తాను ఎటువంటి ఆహారాన్ని స్వీకరించనని, కేవలం వేడి నీటిని మాత్రమే తాగుతానని చెప్పారు. ఇక మార్చి, ఏప్రిల్ మాసాల్లోని చైత్ర నవరాత్రిళ్ళలో రోజుకో పండుని మాత్రమే భుజించే విలక్షణమైన ఉపవాసాన్ని పాటిస్తానని చెప్పారు. ఉదాహరణకు, బొప్పాయిని ఎంచుకుంటే, మొత్తం ఉపవాస కాలంలో బొప్పాయి మాత్రమే తింటానని చెప్పారు. ఈ ఉపవాస పద్ధతులు తన జీవితంలో అంతర్భాగమయ్యాయని, 50 – 55 సంవత్సరాలుగా వీటిని అనుసరిస్తున్నానని శ్రీ మోదీ తెలియజేశారు.

తన ఉపవాస పద్ధతుల గురించి మొదట్లో ఎవరికీ పెద్దగా తెలిసేది కాదని, తాను ముఖ్యమంత్రి, ప్రధానమంత్రి పదవులను స్వీకరించిన తరువాత వీటి గురించి ఇతరులకు తెలియడం మొదలయ్యిందని వ్యాఖ్యానించారు. తాను పాటించే పద్ధతులు ఇతరులకు ప్రయోజనకరంగా ఉండవచ్చు కాబట్టి, ఇతరుల శ్రేయస్సు కోసం పనిచేయాలన్న తన ఆశయానికి అనుగుణంగా ఉంది కాబట్టి తన అనుభవాలను గురించి పంచుకోవడంలో తనకు ఎటువంటి అభ్యంతరం లేదని ప్రధాని పేర్కొన్నారు. ఉపవాస దీక్ష చేస్తున్న సమయంలో, అమెరికా మాజీ అధ్యక్షుడు శ్రీ బరాక్ ఒబామాతో వైట్ హౌస్‌లో జరిగిన ద్వైపాక్షిక సమావేశం సందర్భంగా జరిగిన ఒక ఉదాహరణను శ్రీ మోదీ పంచుకున్నారు.

జీవితపు తొలి రోజుల గురించి అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ, ఉత్తర గుజరాత్, మెహసానా జిల్లా వడ్‌నగర్ లో తాను జన్మించానని, ఆ ప్రాంతపు చారిత్రక ప్రాముఖ్యం గురించి వివరించారు. వడ్ నగర్ చైనా యాత్రికుడు హుయాన్ సాంగ్ వంటి వారిని ఆకర్షించిన బౌద్ధ క్షేత్రమని, 1400 కాలంలో ప్రముఖ బౌద్ధ విద్యాకేంద్రంగా విలసిల్లిందని చెప్పారు. తన బాల్యంలో వడ్ నగర్లో బౌద్ధ, జైన, హిందూ సంస్కృతులు ఎటువంటి పొరపొచ్చాలు లేకుండా మనుగడ సాగించాయని శ్రీ మోదీ గుర్తుచేసుకున్నారు. తన ఊరి చరిత్ర పుస్తకాలకు పరిమితమవలేదని, వడ్ నగర్లోని ప్రతి గోడ, ప్రతి రాయి ఒక కథ చెప్పేదని నెమరువేసుకున్నారు. తాను గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో పురావస్తు తవ్వకాలను పెద్దయెత్తున ప్రోత్సహించానని, నగరం మనుగడ కొనసాగించింది అనేందుకు గుర్తుగా 2,800 సంవత్సరాల నాటి చారిత్రక ఆధారాలు ఆ తవ్వకాలలో బయటపడ్డాయని చెప్పారు. ఈ ఆధారాల వల్ల తదనంతరం అక్కడ అంతర్జాతీయ–స్థాయి మ్యూజియం ఏర్పాటయ్యిందని, ముఖ్యంగా పురావస్తు విభాగానికి చెందిన విద్యార్థులకు ఈ కేంద్రం ఎంతో ఉపయుక్తంగా ఉందని చెప్పారు. ఘనమైన చారిత్రక ప్రాముఖ్యమున్న ప్రాంతంలో పుట్టడం తన అదృష్టమని సంతోషం వ్యక్తం చేశారు. కిటికీలు కూడా లేని చిన్న ఇంట్లో తమ నిరుపేద కుటుంబం నివసించేదని, అయితే ఇతరులతో పోల్చుకునే అవకాశం లేకపోవడంతో పేదరికం ఎన్నడూ బాధించలేదని బాల్యపు జ్ఞాపకాలను పంచుకున్నారు. తమ తండ్రి క్రమశిక్షణ కల్గిన కష్టజీవిగా, సమయపాలన పాటించేవారిగా గుర్తింపు పొందారని చెప్పారు. తన తల్లి ఎంతో శ్రమించేదని, ఇతరుల పట్ల ఎంతో ప్రేమ కనపరచేదని, ఇతరుల వట్ల సానుభూతి, సేవాభావాన్ని తల్లి వద్ద నుంచే నేర్చుకున్నానని చెప్పారు. రోజూ ఉదయాన్నే పిల్లలందరినీ ఒక చోటికి చేర్చి వారికి సాంప్రదాయికంగా వస్తున్న చిట్కాలతో చికిత్స చేసేదని, ఈ అనుభవాలన్నీ తనకు విలువలని తెలియజెప్పాయని, తన వ్యక్తిత్వాన్ని మలచాయని చెప్పారు. రాజకీయ ప్రవేశం తన నిరుపేద మూలాలను వెలుగులోకి తెచ్చిందని, తాను ముఖ్యమంత్రిగా పదవీ ప్రమాణం చేస్తున్న సమయంలో జరిగిన మీడియా కవరేజీ ప్రజలకు తన నేపథ్యాన్ని పరిచయం చేసిందని చెప్పారు. తన జీవితానుభవాలను అదృష్టకరమనుకున్నా, దురదృష్టకరమైనదనుకున్నా, అవి బహిర్గతమై ప్రజలకు తన గురించి తెలియజేస్తున్నాయని వ్యాఖ్యానించారు.

యువతకు ఇచ్చే సందేశం గురించిన ప్రశ్నకు సమాధానమిస్తూ, యువత ఓపిక, ఆత్మవిశ్వాసంతో ఉండాలని, సవాళ్ళు జీవితంలో భాగమైనప్పటికీ అవి వ్యక్తి లక్ష్యాన్ని ప్రభావితం చేయరాదని చెప్పారు. కష్టాలు సహనానికి పరీక్షలని, అవి మనిషిని ఓడించడానికి కాక, బలోపేతం చేయడం కోసం ఎదురావుతాయని అంటూ ప్రతి సంక్షోభం అభివృద్ధికి అవకాశాన్ని అందిస్తుందని అన్నారు. జీవితంలో దగ్గరి దోవలు పనిచేయవని చెబుతూ రైల్వే ట్రాక్ల ఉదాహరణతో విపులీకరించారు. పట్టాలు దాటవద్దంటూ రైల్వే స్టేషన్లలో కనపడే హెచ్చరికలను ఉటంకిస్తూ, "షార్ట్‌కట్స్ విల్ కట్ యూ షార్ట్" ? షార్ట్ కట్లు మిమ్మల్ని అర్థాంతరంగా ఆపేస్తాయి అని వివరించారు. విజయం సాధించడంలో సహనం, పట్టుదల ప్రాముఖ్యాన్ని గురించి చెబుతూ ప్రతి బాధ్యతనూ మనఃస్ఫూర్తిగా చేపట్టాలని, ప్రయాణాన్ని ఆస్వాదిస్తూ జీవితాన్ని అభిరుచితో గడపాలని ఉద్బోధించారు. సమృద్ధి మాత్రమే విజయానికి హామీ ఇవ్వదని, వనరులు ఉన్నవారు కూడా ప్రతిరోజూ ఎదుగుతూ, సమాజ సంక్షేమానికి దోహదపడాలి కాబట్టి, వ్యక్తిగత ఎదుగుదల జీవితాంతం అవసరమని, నేర్చుకోవడం ఎప్పటికీ ఆపరాదని చెప్పారు. తన తండ్రి టీ దుకాణంలో పని చేసేటప్పుడు ఇతరులతో మసలే పద్ధతిని నేర్చుకున్నానని, నిరంతర అభ్యాసం, వ్యక్తిత్వాన్ని మెరుగుపరుచుకోవడం ఎంత కీలకమో అర్థం చేసుకున్నానని చెప్పారు. చాలా మంది ప్రజలు పెద్ద లక్ష్యాలను నిర్దేశించుకుని, అవి విఫలమైనప్పుడు నిరాశకు గురవుతారని అంటూ, ఏదో ఒక గుర్తింపు కోసం పాకులాడకుండా ఏదైనా పనిని గొప్పగా చేయడంపైనే దృష్టి పెట్టాలని సలహా ఇచ్చారు. ఇటువంటి దృక్కోణం నిరంతర సాధన, లక్ష్యాల వైపు పురోగమించడంలో సహాయపడుతుందన్నారు. మనకు దక్కేదానికన్నా ఇతరులకు ఇవ్వడంలోనే సిసలైన తృప్తి ఉంటుందని, యువత పరులకు సహాయం, సేవలపై దృష్టి కేంద్రీకరించాలని చెప్పారు.

ఆయనను హిమాలయాలకు వెళ్లడాన్ని గురించి అడిగినప్పుడు, శ్రీ మోదీ ఒక చిన్న పట్టణంలో తాను పెరిగిన సంగతిని తెలిపారు. అక్కడ సమష్టి జీవనానికి పెద్దపీట వేశారన్నారు. తాను తరచు స్థానిక గ్రంథాలయానికి వెళ్లేవాడినని, స్వామి వివేకానంద, ఛత్రపతి శివాజీ మహారాజ్ వంటి వారిని గురించి పుస్తకాలలో చదివి ప్రేరణను పొందేవాడినన్నారు. ఇదితన జీవనాన్ని కూడా అదే ప్రకారంగా మలచుకోవాలన్న అభిలాషను కలిగించిందనీ, తాను తన శారీరక పరిమితులు, మనోనిబ్బరం ఏ స్థాయిలో ఉన్నాయో తెలుసుకోవడానికి ఆరుబయట చల్లని వాతావరణంలో పడుకునేవాడిననీ చెప్పారు. స్వామి వివేకానంద బోధనలు తనపై కలగజేసిన ప్రభావాన్ని ఆయన వివరించారు. అనారోగ్యం పాలబడ్డ తన తల్లికి సహాయం చేయాల్సిన అవసరం వివేకానందకు ఉన్నప్పటికీ ధ్యాన సమయంలో కాళీమాతను ఏమయినా అడగడానికీ నోరు కదపలేక పోయిన అనుభవాన్ని గురించి శ్రీ మోదీ ప్రధానంగా ప్రస్తావించారు. ఈ అనుభూతే తరువాత తరువాత వివేకానందునిలో ఎదుటి వారికి ఇవ్వాలన్న భావనకు అంకురార్పణ చేసింది. ఈ ఘట్టం తనను ప్రభావితుడిని చేసిందని శ్రీ మోదీ అన్నారు. సిసలైన సంతృప్తి అనేది ఇవ్వడం నుంచి, ఇతరులకు సేవ చేయడం నుంచే కలుగుతుందని స్పష్టం చేశారు. కుటుంబంలో పెళ్లి జరిగిన వేళ, తాను ఒక సాధువు బాగోగులు చూసుకోవడానికి వెనుకవట్టనే ఉండిపోవాలని నిర్ణయించుకొన్న సందర్భాన్ని ఆయన గుర్తుకు తెచ్చుకొన్నారు. ఈ ఘటన ఆధ్యాత్మిక కార్యకలాపాల పట్ల మొదట్లో తాను ఎలా మొగ్గిందీ చెబుతోంది. సైనికులు తన ఊరికి రావడం చూసినప్పుడు దేశానికి సేవ చేయాలన్న ప్రేరణ తనలో కలిగిందని, అయితే ఆ సమయంలో అందుకు ఏం చేయాలో తనకు స్పష్టంగా తెలియలేదన్నారు. జీవనానికి అర్థం ఏమిటో కనుక్కోవాలన్న ప్రగాఢ కోర్కె తనకు కలిగి, దీనిని అన్వేషించడానికి తాను... యాత్రను మొదలుపెట్టానని ప్రధాని చెప్పారు. స్వామి ఆత్మస్థానందజీ వంటి సాధువులతో సాన్నిహిత్యాన్ని ఏర్పరుచుకోవడాన్ని, ఆ స్వామీజీయే సమాజ సేవ ప్రాముఖ్యాన్ని గురించి తనకు చెప్పి, మార్గదర్శనం చేశారన్నారు. మిషన్లో తాను గడిపిన కాలంలో, ప్రముఖ సాధువులతో భేటీ అయినట్లు, వారు వారి ప్రేమను, ఆశీస్సులను తనపై కురిపించినట్లు శ్రీ మోదీ చెప్పారు. హిమాలయాలలో ఉండగా లభించిన ఏకాంతం, తాపసులతో తాను మాట్లాడడం.. ఇవి తనను తాను తీర్చిదిద్దుకోవడానికి, తన అంతర్గత శక్తిని తాను గుర్తించడానికి తోడ్పడ్డాయని శ్రీ మోదీ అన్నారు. వ్యక్తిగతంగా తాను ఎదగడంలో ధ్యానం, సేవ, భక్తి.. వీటి పాత్ర ఎంతో ఉందన్నారు.

రామకృష్ణ మిషన్లో స్వామి ఆత్మస్థానందజీతో తనకు ఎదురైన అనుభవాన్ని శ్రీ మోదీ పంచుకొంటూ, దీని కారణంగానే తాను ప్రతి స్థాయిలో సేవే ప్రధానమైన జీవనాన్ని గడపాలని నిర్ణయించుకొన్నానన్నారు. ఇతరులు తననను ప్రధానిగానో, లేదా ముఖ్యమంత్రిగానో చూస్తే చూడవచ్చు కానీ తాను ఆధ్యాత్మిక సిద్ధాంతాలకు పూర్తిగా కట్టుబడి ఉన్నానన్నారు. తన అంతర్గత స్థిరత్వం ఇతరులకు సేవ చేయడంలో ఇమిడి ఉందని, అది పిల్లలను సంరక్షించడంలో మాతృమూర్తికి సాయపడే రూపంలో కావచ్చు, లేదా హిమాలయాల్లో సంచరించడం కావచ్చు, లేదా తన ప్రస్తుత బాధ్యతాయుత పదవిలో పనిచేయడం కావచ్చు.. వీటి అన్నింటిలోనూ అది ప్రతిబింబిస్తుందని శ్రీ మోదీ అన్నారు. తన దృష్టిలో, ఒక సాధువుకు ఒక నేతకు మధ్య ఎలాంటి వాస్తవమైన వ్యత్యాసం లేదని, ఎందుకంటే ఈ రెండు పాత్రలకు సమానమైన విలువల మార్గదర్శనం లభిస్తుందన్నారు. దుస్తులు, చేసే పని వంటి బయటకు కనిపించే దృష్టికోణాలు మారితే మారవచ్చు గాని సేవ చేయాలన్న అంకితభావం మాత్రం మారదని ఆయన స్పష్టం చేశారు. ప్రతి బాధ్యతను తాను శాంతంగా, ఏకాగ్రతతో, అంకితభావంతో నెరవేరుస్తానని ఆయన చెప్పారు.

తొలి రోజుల్లో తనపై రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) చూపిన ప్రభావాన్ని చర్చిస్తూ, దేశభక్తిపూరిత గేయాలంటే తనకు చిన్నప్పటి నుంచీ ఎంతో మక్కువ ఉండేదని, ముఖ్యంగా మకోషి అనే అతను ఒక డప్పు తీసుకుని తమ ఊరికి వచ్చి పాడే పాటలు తనకు బాగా నచ్చేవన్నారు. ఆ పాటలు తననుఎంతగానో ప్రభావితం చేశాయని, అవే తరువాత తరువాత ఆర్ఎస్ఎస్తో తాను అనుబంధాన్ని ఏర్పరుచుకోవడంలో అవి ప్రభావాన్ని చూపించాయని ఆయన అన్నారు. ఏ పనిని అయినా సరే.. అది చదువుకోవడం, లేదా వ్యాయామం చేయడం, లేదా దేశం కోసం పాటుపడడం.. ఇలా ఏదయినా, ఒక ప్రయోజనం ఉండే పని చేయాలనే కీలక విలువల్ని తనలో పాదుగొల్పింది ఆర్ఎస్ఎస్ అని ఆయన వివరించారు. జీవనంలో ఒక పరమార్థంతో ముందుకు సాగడానికి ఆర్ఎస్ఎస్ ఒక స్పష్టమైన దిశను అందిస్తుందని శ్రీ మోదీ వ్యాఖ్యానించారు. ప్రజలకు సేవ చేయడం అంటే అది దైవానికి సేవ చేయడంతో సమానం అని ఆయన స్పష్టం చేశారు. ఆర్ఎస్ఎస్ 100వ వార్షికోత్సవానికి చేరువ అవుతోందని, ప్రపంచవ్యాప్తంగా లక్షల కొద్దీ స్వయంసేవకులున్న భారీ సంస్థ అని ఆయన తెలిపారు. ఆర్ఎస్ఎస్ ప్రేరణగా నిలవడంతో, అనేక కార్యక్రమాలు కొనసాగుతున్నాయి.. ఉదాహరణకు సేవా భారతి మురికివాడల్లో, 1,25,000కు పైచిలుకు సేవాపథకాలను ప్రభుత్వ సహాయం లేకుండానే నడుపుతోందని శ్రీ మోదీ వెల్లడించారు. వన్వాసీ కల్యాణ్ ఆశ్రమ్ గిరిజన ప్రాంతాల్లో 70,000కు పైగా ఏకోపాధ్యాయ పాఠశాలలను ఏర్పాటు చేసిందని కూడా శ్రీ మోదీ చెప్పారు. విద్యాభారతి సుమారు 25,000 పాఠశాలలను నిర్వహిస్తూ 30 లక్షలమంది విద్యార్థులకు చదువు చెబుతోందని తెలిపారు. విద్యకు, విలువలకు ఆర్ఎస్ఎస్ పెద్దపీట వేస్తుందని, విద్యార్థులు నేల విడచి సాముచేయకుండా, సమాజానికో గుదిబండలా మారకుండా ఉండటానికి నైపుణ్యాలను నేర్చుకొనేటట్లు శ్రద్ధ తీసుకొంటుందని ఆయన స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా లక్షల సంఖ్యలో సభ్యులు ఉన్న భారతీయ మజ్దూర్ సంఘ్ సాంప్రదాయక కార్మిక ఉద్యమాలకు భిన్నంగా "కార్మికులు ప్రపంచాన్ని ఏకం చేయాల"నే విషయంపై దృష్టిని సారించి, ఒక విశిష్ట దృక్పథాన్ని అవలంబిస్తోందని ఆయన అన్నారు. ఆర్ఎస్ఎస్ నుంచి తాను పొందిన జీవన విలువలు, ప్రయోజనాలతోపాటు స్వామి ఆత్మస్థానంద వంటి సాధువుల నుంచి అందుకొన్న ఆధ్యాత్మిక మార్గదర్శకత్వానికిగాను ప్రధాని తన కృతజ్ఞతలను తెలియజేశారు.

భారత్ గురించి శ్రీ మోదీ మాట్లాడుతూ భారత్‌అంటూ ఒక సాంస్కృతిక గుర్తింపు ఉందని, భారత్ నాగరికత వేల సంవత్సరాల నాటిదన్నారు. వందకు పైగా భాషలు, వేల కొద్దీ మాండలికాలతో విలసిల్లుతున్న భారత్ సువిశాలత్వాన్ని ఆయన ప్రధానంగా చాటిచెబుతూ, ప్రతి ఇరవై మైళ్లకు భాష, ఆచారాలు, వంట పద్ధతులు, వస్త్రధారణ మారిపోతూ ఉంటాయని, ఇంతటి వైవిధ్యం నెలకొన్నప్పటికీ ఈ దేశాన్ని ఒక ఉమ్మడి బంధం కలిపి ఉంచుతోందన్నారు. భగవాన్ రాముని కథలు భారత్ నలుమూలల ప్రతిధ్వనిస్తుంటాయి, భగవాన్ రాముని ప్రేరణతో ప్రతి ప్రాంతంలోనూ వ్యక్తులకు పేర్లు పెట్టుకోవడాన్ని గమనించవచ్చన్నారు. గుజరాత్లో రాంభాయి అని ఉంటే, తమిళనాడులో రామచంద్రన్ అని, మహారాష్ట్రలో రాం భావూ అనే పేరు చలామణిలో ఉంటాయని వివరించారు. ఈ అద్వితీయ సాంస్కృతిక బంధమే ఇండియాను ఒకే నాగరికతగా పెనవేస్తోందని ఆయన అభివర్ణించారు. స్నానమాచరించే సమయంలో, దేశంలో అన్ని నదుల పేర్లను స్మరించుకొనే ఆచారమంటూ ఉందని, ప్రజలు ఆ వేళ గంగ, యమున, గోదావరి, సరస్వతి, నర్మద, సింధు, కావేరీ అంటూ నదుల నామాలను ఉచ్చరిస్తారన్నారు. భారతీయ సంప్రదాయాల్లో ఈ ఏకత్వ భావన లోతుగా పాతుకుపోయిందని, ముఖ్య కార్యక్రమాలు, అనుష్ఠానాలలో చెప్పుకొనే సంకల్పాలలో ఈ భావన ప్రతిబింబిస్తూ ఉంటుందని ఆయన అన్నారు. వీటిని చారిత్రక రికార్డుల్లా కూడా భావించవచ్చన్నారు. జంబూద్వీపం మొదలు కులదేవత పేరు చెప్పుకొనేదాకా కార్యక్రమాలలో విశ్వమంతటికీ ఆహ్వానం పలికే సంప్రదాయాలకు భారతీయ ధార్మిక గ్రంథాలు అత్యంత సావధానపూర్వకంగా మార్గదర్శనం వహిస్తూ వచ్చాయని, ఈ ఆచారాలు సజీవంగా నిలిచి నేటికీ వీటిని దేశంలో నిత్యం ఆచరిస్తున్నారన్నారు. పశ్చిమ, ప్రపంచ నమూనాలు దేశాలను పరిపాలన వ్యవస్థలుగానే చూస్తుంటే, భారత్లో ఏకత్వం దాని సాంస్కృతిక బంధాలలో ఒక దండగా రూపుదాల్చిందన్నారు. భారత్లో చరిత్ర పొడవునా విభిన్న పాలక వ్యవస్థలుంటూ మనుగడ సాగించాయని, కానీ దీని ఏకత్వం సాంస్కృతిక సంప్రదాయాల మాధ్యమం ద్వారా చెక్కుచెదరకుండా ఉందన్నారు. భారతదేశం ఏకత్వాన్ని నిలబెట్టడంలో తీర్థయాత్ర సంప్రదాయాలు పోషించిన పాత్ర ఎంతో ఉందని కూడా శ్రీ మోదీ స్పష్టం చేశారు. శంకరాచార్యులు నాలుగు తీర్థ స్థలాలను నెలకొల్పారని ప్రధాని పేర్కొన్నారు. నేటికీ లక్షల మంది తీర్థయాత్రలకు వెళ్తూ ఉన్నారు. రామేశ్వరం నుంచి కాశీకి, కాశీ నుంచి రామేశ్వరానికి జలాన్ని తీసుకువస్తుంటారని తెలిపారు. భారతదేశ క్యాలెండర్ను చూస్తే చాలు... దేశంలో విభిన్న సంప్రదాయాలు ఎంత సమృద్ధంగా ఉన్నదీ తెలిసిపోతుందనిఆయన అన్నారు.

గాంధీ మహాత్ముని వారసత్వం, స్వాతంత్ర్యం కోసం భారత్ పోరాడిన తీరును ప్రధానమంత్రి చర్చిస్తూ– మహాత్మాగాంధీ మాదిరిగా– తాను గుజరాత్లో పుట్టానని, తన మాతృభాష కూడా గుజరాతీయేనని వివరించారు. గాంధీకి ఒక న్యాయవాదిగా విదేశాల్లో అవకాశాలకు కొదవ లేకపోయినప్పటికీ, కర్తవ్య పరాయణత్వం, కుటుంబ విలువల పట్ల మక్కువ.. ఇవి ఆయనకు మార్గదర్శనం చేయగా ఆయన తన జీవనాన్ని భారతదేశ ప్రజలకు సేవ చేయడానికే అంకితం చేయాలని సంకల్పించుకొన్నారని శ్రీ మోదీ అన్నారు. గాంధీ సిద్ధాంతాలు, చేతలు ఈ నాటికీ భారత్లో ప్రతి ఒక్కరినీ ప్రభావితం చేస్తూనే ఉన్నాయని ఆయన స్పష్టం చేశారు. స్వచ్ఛత ముఖ్యమని గాంధీ చెబుతూ వచ్చారు... ఆయన దీనిని స్వయంగా ఆచరించి చూపెట్టారు. అంతేకాదు ఆయన పాల్గొన్న చర్చలలో కూడా స్వచ్ఛతకు ప్రాధాన్యాన్ని ఇచ్చారని శ్రీ మోదీ అన్నారు. భారత్ స్వాతంత్ర్యాన్ని సాధించుకోవడం కోసం దీర్ఘకాలం పోరాడిందని, ఆ కాలంలో వలసవాద పాలన వందల సంవత్సరాల తరబడి కొనసాగినా స్వాతంత్ర్య జ్వాల దేశవ్యాప్తంగా ఉజ్వలంగా మండుతూ వచ్చిందన్నారు. లక్షల కొద్దీ జనం వారి ప్రాణాలను త్యాగం చేశారు. జైళ్లలో మగ్గారు. అమరత్వాన్ని పొందారనీ శ్రీ మోదీ గుర్తు చేశారు. అనేక మంది స్వాతంత్ర్యయోధులు శాశ్వత ప్రభావాన్ని కలగజేసినా, మహాత్మాగాంధీ సత్యంపై ఆధారపడ్డ ఒక భారీ జనాందోళనకు సారథ్యం వహించి జాతిని మేల్కొలిపారని శ్రీ మోదీ చెప్పారు. ప్రతి ఒక్క వ్యక్తినీ స్వాతంత్ర్య సమరంలో పాలుపంచుకొనేటట్లు చేయగలిగిన దక్షత గాంధీలో ఉంది.. వీధిని ఊడ్చి శుభ్రపరిచే పారిశుధ్య కార్మికులు మొదలు ఉపాధ్యాయులు, నేతకారులు, సంరక్షకులు.. ఇలా ప్రతి సాధారణ పౌరులను స్వాతంత్ర్య సాధన కోసం సైనికులుగా గాంధీ మార్చివేశారు. అలా ఒక ఉద్యమాన్ని పెద్ద ఎత్తున నిర్మించారు. బ్రిటిషు వారు దీనిని పూర్తి స్థాయిలో అర్థం చేసుకోలేకపోయారని శ్రీ మోదీ వ్యాఖ్యానించారు. దండి సత్యాగ్రహానికున్న ప్రాధాన్యం ఎంతటిదో.. ఒక చిటికెడు ఉప్పు ఎలా మహోద్ధృత విప్లవ జ్వాలను రగిలించివేసిందో ఆయన వివరించారు. కొల్లాయి కట్టుకొని రౌండ్టేబుల్ సమావేశానికి గాంధీ వెళ్లి బకింగ్హామ్ రాజమహలులో కింగ్ జార్జ్తో భేటీ అయిన ఉదంతాన్ని ప్రధానమంత్రి పంచుకొన్నారు. "మీ రాజు మన ఇద్దరికీ సరిపోయేటంత దుస్తులను ధరించి ఉన్నారు" అంటూ గాంధీ జీ సమయస్ఫూర్తిగా మాట్లాడి, తన హాస్య చతురతను వెల్లడించారని ప్రధాని అన్నారు. అంతా ఐకమత్యంతో ఉండాలని, ప్రజలకున్న శక్తిని చాటాలని గాంధీ పిలుపునివ్వడాన్ని గురించి శ్రీ మోదీ చెబుతూ, ఈ నినాదం ఈనాటికీ మార్మోగుతూనే ఉందన్నారు. ప్రతి ఒక్క కార్యక్రమంలోనూ సామాన్య మానవుడిని భాగస్వామిని చేయాలని, పూర్తిగా ప్రభుత్వంపైనే ఆధారపడి ఉండటానికి బదులు సామాజిక మార్పును ప్రోత్సహించాలనే తన స్వీయ నిబద్ధతను ప్రధాని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

నేటి కాలమాన పరిస్థితుల్లోనూ మహాత్మా గాంధీ ఔచిత్యాన్ని ప్రస్తావిస్తూ– ఆయన వారసత్వం కాలాన్ని జయించిందని శ్రీ మోదీ స్పష్టంచేశారు. ఈ సందర్భంగా తన కర్తవ్య నిబద్ధతను గుర్తుచేస్తూ– తన ధైర్యం తన పేరుతో కాకుండా 140 కోట్ల మంది దేశవాసుల మద్దతు, అనాదిగా వస్తున్న వేల ఏళ్ల సంస్కృతి–వారసత్వాలతో ముడిపడి ఉన్నదని వివరించారు. ''నేనొక ప్రపంచ నాయకుడితో కరచాలనం చేస్తున్నానంటే, అది మోదీ ఒక్కడు కాదు... 140 కోట్ల మంది భారతీయులు చేయి కలుపుతున్నారని అర్థం'' అని సవినయంగా పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికలకు ముందు 2013లో తనను ప్రధానమంత్రి అభ్యర్థిగా పార్టీ ప్రకటించినప్పుడు తలెత్తిన విస్తృత విమర్శలను గుర్తుచేస్తూ– భారత విదేశాంగ విధానం, ప్రపంచ భౌగోళిక–రాజకీయ స్థితిగతులపై తన అవగాహనను వారు ప్రశ్నించారని శ్రీ మోదీ పేర్కొన్నారు. ఆ సమయంలో తన స్పందనను వివరిస్తూ– "భారత్ తనను చిన్నచూపు చూడటాన్ని ఎన్నడూ అనుమతించదు... ఎవరినీ ఎప్పుడూ చిన్నచూపు చూడదు. ఇతర ప్రపంచ దేశాలకు దీటుగా నిలుస్తుంది" అని చెప్పానన్నారు. ఈ విశ్వాసమే తన విదేశాంగ విధానానికి కీలకమని పునరుద్ఘాటిస్తూ– దేశమే సదా ప్రధానమని స్పష్టం చేశారు. ప్రపంచ శాంతి, సౌభ్రాత్రాలకు భారత్‌ప్రాధాన్యం 'వసుధైవ కుటుంబకం' అనే దృక్పథంలో అనాదిగా వేళ్లూనుకున్నదని ప్రధానమంత్రి గుర్తుచేశారు. పునరుత్పాదక ఇంధనం దిశగా "ఒకే సూర్యుడు–ఒక ప్రపంచం–ఒక గ్రిడ్" సహా సకల జీవజాలానికీ వర్తించే "ఒకే ప్రపంచం–ఒకే ఆరోగ్యం" వంటి ప్రపంచ ఆరోగ్య సంరక్షణ దాకా అంతర్జాతీయంగా అనేక కార్యక్రమాల్లో భారత్ పోషిస్తున్న పాత్రను ఆయన ప్రస్తావించారు. ఈ నేపథ్యంలో ప్రపంచ సౌభాగ్యం ఇనుమడింపజేయాల్సిన బాధ్యతను స్పష్టం చేస్తూ, ఈ దిశగా అంతర్జాతీయ సమాజం సమష్టి కృషికి నడుం బిగించాలని పిలుపునిచ్చారు.

# ప్రపంచ శాంతి సుస్థిరతల కోసం భారత్, చైనాల మధ్య సహకారం అత్యవసరం: ప్రధాని

న్యూఢిల్లీ, మార్చి 18:ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈరోజు పాడ్ క్యాస్ట్ ద్వారా లెక్స్ ఫ్రిడ్‌మాన్‌తో జరిపిన సంభాషణలో అనేక అంశాల గురించి ముచ్చటించారు. ఆత్మీయంగా జరిగిన సంభాషణలో భాగంగా ఉపవాసాలు ఎందుకు చేపడతారు, నిరాహారంగా ఉండటం ఎలా సాధ్యం అన్న ఫ్రిడ్‌మాన్ ప్రశ్నకు సమాధానమిస్తూ, తన ఉపవాస దీక్షకు గౌరవ సూచకంగా ఫ్రిడ్‌మాన్ కూడా ఉపవాసాన్ని చేపట్టినందుకు ప్రధాని కృతజ్ఞతలు తెలిపారు. “భారతదేశంలో మతపరమైన ఆచార వ్యవహారాలు నిత్య జీవితంతో పెనువేసుకుని ఉంటాయి..” అని తెలియజేస్తూ, హిందూ మతం కేవలం ఆచార వ్యవహారాలకే పరిమితం కాదని, దేశ అత్యున్నత న్యాయస్థానం వివరించినట్టు జీవితానికి దిశానిర్దేశం చేసే సిద్ధాంతమని వెల్లడించారు. ఉపవాసం వల్ల క్రమశిక్షణ అలవడుతుందని, మనస్సు, శరీరాల మధ్య సమన్వయం మెరుగవుతుందని చెప్పారు.

ఉపవాస సమయంలో ఇంద్రియాలన్నీ చురుకుగా మారతాయని, దాంతో పరిసరాల పట్ల అవగాహన పెరుగుతుందని చెబుతూ, ఆ సమయంలో సున్నితమైన వాసనలను కూడా స్పష్టంగా తెలుసుకోగలుగుతామని చెప్పారు. ఉపవాసం ఆలోచనల పదును పెంచి, కొత్త దృక్పథాలను, విలక్షణమైన యోచనలను ప్రేరేపిస్తుందని చెప్పారు. ఉపవాసం అంటే కేవలం ఆహారానికి దూరంగా ఉండటమే కాదని, శాస్త్రీయ విధానమనీ, శరీరంలోని విషాలను బయటకు పంపే ప్రక్రియ అని చెప్పారు. ఉపవాసం చేపట్టే కొద్దిరోజుల ముందు నిర్దిష్టమైన ఆయుర్వేద, యోగా పద్ధతులను పాటించడం ద్వారా తన శరీరాన్ని సిద్ధం చేసుకుంటానని, ఆ సమయంలో నీరు అధికంగా తాగడం ద్వారా శరీరంలో తగినంత నీరు ఉండేలా జాగ్రత్త తీసుకుంటానని శ్రీ మోదీ వెల్లడించారు. తదనంతరం మొదలుపెట్టే ఉపవాసాన్ని భక్తి, క్రమశిక్షణలకు అంకితమయ్యే సమయంగా భావిస్తానని, లోతైన చింతనకు, సంపూర్ణమైన దృష్టి కేంద్రీకరణకు వెచ్చిస్తానని చెప్పారు. తాను పాఠశాల విద్యార్థిగా ఉన్న సమయంలో జరిగిన ఒక సంఘటన వల్ల, మహాత్మా గాంధీ ఉద్యమం వల్ల ఉపవాసాలను అలవాటు చేసుకున్నానని శ్రీ మోదీ వెల్లడించారు. తొలిసారి ఉపవాసం చేసినప్పుడు శక్తి, అవగాహనలు పెరిగిన భావన కలిగిందని, దాంతో ఈ ప్రక్రియ వల్ల పరివార్తనాత్మక శక్తి అనుభవంలోకి వచ్చిందని చెప్పారు. ఉపవాసం తనని మందకొడిగా చేసే బదులు తనలో వేగాన్ని, చురుకునీ, సామర్థ్యాన్ని పెంచుతుందన్నారు. దీక్ష సమయంలో తన ఆలోచనలు వేగంగా సాగుతాయని చెబుతూ ఉపవాసాన్ని మెరుగైన సృజన ద్వారా తన భావనలను పంచుకునే దివ్యమైన అవకాశంగా భావిస్తానని ప్రధాని అన్నారు.

ఉపవాసాలు, కొన్నిసార్లు తొమ్మిది రోజుల పాటు కొనసాగే దీర్ఘ ఉపవాసాలతో ప్రపంచ వేదికపై నాయకుడిగా తన పాత్రను ఎలా నిర్వర్తించగలుగుతారని అడిగినప్పుడు, శ్రీ మోదీ ప్రాచీన భారతీయ సంప్రదాయమైన చాతుర్మాస దీక్ష గురించి ప్రస్తావించారు. వర్షాకాలంలో జీర్ణక్రియ సహజంగానే మందగిస్తుందని, ఆ సమయంలో చాలా మంది భారతీయులు రోజుకు ఒక పూట మాత్రమే భోజనం చేసే విధానాన్ని అనుసరిస్తారని వ్యాఖ్యానించారు. ఈ సంప్రదాయం జూన్ మధ్యలో ప్రారంభమై నవంబర్‌లో దీపావళి తర్వాత వరకూ అంటే, దాదాపు నాలుగు నుండి నాలుగున్నర నెలల వరకు కొనసాగుతుందని చెప్పారు. సెప్టెంబర్ లేదా అక్టోబరులో నిర్వహించే దసరా పండుగ సమయంలో, శక్తి, భక్తి క్రమశిక్షణకు మారుపేరైన నవరాత్రి పర్వదినాల తొమ్మిది రోజుల పాటూ తాను ఎటువంటి ఆహారాన్ని స్వీకరించనని, కేవలం వేడి నీటిని మాత్రమే తాగుతానని చెప్పారు. ఇక మార్చి, ఏప్రిల్ మాసాల్లోని చైత్ర నవరాత్రిళ్ళలో రోజుకో పండుని మాత్రమే భుజించే విలక్షణమైన ఉపవాసాన్ని పాటిస్తానని చెప్పారు. ఉదాహరణకు, బొప్పాయిని ఎంచుకుంటే, మొత్తం ఉపవాస కాలంలో బొప్పాయి మాత్రమే తింటానని చెప్పారు. ఈ ఉపవాస పద్ధతులు తన జీవితంలో అంతర్భాగమయ్యాయని, 50 – 55 సంవత్సరాలుగా వీటిని అనుసరిస్తున్నానని శ్రీ మోదీ తెలియజేశారు.

తన ఉపవాస పద్ధతుల గురించి మొదట్లో ఎవరికీ పెద్దగా తెలిసేది కాదని, తాను ముఖ్యమంత్రి, ప్రధానమంత్రి పదవులను స్వీకరించిన తరువాత వీటి గురించి ఇతరులకు తెలియడం మొదలయ్యిందని వ్యాఖ్యానించారు. తాను పాటించే పద్ధతులు ఇతరులకు ప్రయోజనకరంగా ఉండవచ్చు కాబట్టి, ఇతరుల శ్రేయస్సు కోసం పనిచేయాలన్న తన ఆశయనికి అనుగుణంగా ఉంది కాబట్టి తన అనుభవాలను గురించి పంచుకోవడంలో తనకు ఎటువంటి అభ్యంతరం లేదని ప్రధాని పేర్కొన్నారు. ఉపవాస దీక్ష చేస్తున్న సమయంలో, అమెరికా మాజీ అధ్యక్షుడు శ్రీ బరాక్ ఒబామాతో వైట్ హౌస్‌లో జరిగిన ద్వైపాక్షిక సమావేశం సందర్భంగా జరిగిన ఒక ఉదాహరణను శ్రీ మోదీ పంచుకున్నారు.

జీవితపు తొలి రోజుల గురించి అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ, ఉత్తర గుజరాత్, మెహసానా జిల్లా వడ్ నగర్ లో తాను జన్మించానని, ఆ ప్రాంతపు చారిత్రక ప్రాముఖ్యం గురించి వివరించారు. వడ్ నగర్ చైనా యాత్రికుడు హుయాన్ సాంగ్ వంటి వారిని ఆకర్షించిన బౌద్ధ క్షేత్రమని, 1400 కాలంలో ప్రముఖ బౌద్ధ విద్యాకేంద్రంగా విలసిల్లిందని చెప్పారు. తన బాల్యంలో వడ్ నగర్లో బౌద్ధ, జైన, హిందూ సంస్కృతులు ఎటువంటి పొరపొచ్చాలు లేకుండా మనుగడ సాగించాయని శ్రీ మోదీ గుర్తుచేసుకున్నారు. తన ఊరి చరిత్ర పుస్తకాలకు పరిమితమవలేదని, వడ్ నగర్లోని ప్రతి గోడ, ప్రతి రాయీ ఒక కథ చెప్పేదని నెమరువేసుకున్నారు. తాను గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో పురావస్తు తవ్వకాలను పెద్దయెత్తున ప్రోత్సహించానని, నగరం మనుగడ కొనసాగించింది అనేందుకు గుర్తుగా 2,800 సంవత్సరాల నాటి చారిత్రక ఆధారాలు ఆ తవ్వకాలలో బయటపడ్డాయని చెప్పారు. ఈ ఆధారాల వల్ల తదనంతరం అక్కడ అంతర్జాతీయ–స్థాయి మ్యూజియం ఏర్పాటయ్యిందని, ముఖ్యంగా పురావస్తు విభాగానికి చెందిన విద్యార్థులకు ఈ కేంద్రం ఎంతో ఉపయుక్తంగా ఉందని చెప్పారు. ఘనమైన చారిత్రక ప్రాముఖ్యమున్న ప్రాంతంలో పుట్టడం తన అదృష్టమని సంతోషం వ్యక్తం చేశారు. కిటికీలు కూడా లేని చిన్న ఇంట్లో తమ నిరుపేద కుటుంబం నివసించేదని, అయితే ఇతరులతో పోల్చుకునే అవకాశం లేకపోవడంతో పేదరికం ఎన్నడూ బాధించలేదని బాల్యపు జ్ఞాపకాలను పంచుకున్నారు. తమ తండ్రి క్రమశిక్షణ కల్గిన కష్టజీవిగా, సమయపాలన పాటించేవారిగా గుర్తింపు పొందారని చెప్పారు. తన తల్లి ఎంతో శ్రమించేదని, ఇతరుల పట్ల ఎంతో ప్రేమ కనపరచేదని, ఇతరుల పట్ల సానుభూతి, సేవాభావాన్ని తల్లి వద్ద నుంచే నేర్చుకున్నానని చెప్పారు. రోజూ ఉదయాన్నే పిల్లలందరినీ ఒక చోటికి చేర్చి వారికి సాంప్రదాయికంగా వస్తున్న చిట్కాలతో చికిత్స చేసేదని, ఈ అనుభవాలన్నీ తనకు విలువలని తెలియజెప్పాయని, తన వ్యక్తిత్వాన్ని మలచాయని చెప్పారు. రాజకీయ ప్రవేశం తన నిరుపేద మూలాలను వెలుగులోకి తెచ్చిందని, తాను ముఖ్యమంత్రిగా పదవీ ప్రమాణం చేస్తున్న సమయంలో జరిగిన మీడియా కవరేజీ ప్రజలకు తన నేపథ్యాన్ని పరిచయం చేసిందని చెప్పారు. తన జీవితానుభవాలను అదృష్టకరమనుకున్నా, దురదృష్టకరమెనదనుకున్నా, అవి బహిర్గతమై ప్రజలకు తన గురించి తెలియజేస్తున్నాయని వ్యాఖ్యానించారు.

యువతకు ఇచ్చే సందేశం గురించిన ప్రశ్నకు సమాధానమిస్తూ, యువత ఓపిక, ఆత్మవిశ్వాసంతో ఉండాలని, సవాళ్ళు జీవితంలో భాగమైనప్పటికీ అవి వ్యక్తి లక్ష్యాన్ని ప్రభావితం చేయరాదని చెప్పారు. కష్టాలు సహనానికి పరీక్షలని, అవి మనిషిని ఓడించడానికి కాక, బలోపేతం చేయడం కోసం ఎదురావుతాయని అంటూ ప్రతి సంక్షోభం అభివృద్ధికి అవకాశాన్ని అందిస్తుందని అన్నారు. జీవితంలో దగ్గరి దోవలు పనిచేయవని చెబుతూ రైల్వేట్రాక్‌ల ఉదాహరణతో విపులీకరించారు. పట్టాలు దాటవద్దంటూ రైల్వే స్టేషన్లలో కనపడే హెచ్చరికలను ఉటంకిస్తూ, “షార్ట్‌కట్స్ విల్ కట్ యూ షార్ట్” ? షార్ట్ కట్లు మిమ్మల్ని అర్ధాంతరంగా ఆపేస్తాయి అని వివరించారు. విజయం సాధించడంలో సహనం, పట్టుదల ప్రాముఖ్యాన్ని గురించి చెబుతూ ప్రతి బాధ్యతనూ మనఃస్ఫూర్తిగా చేపట్టాలని, ప్రయాణాన్ని ఆస్వాదిస్తూ జీవితాన్ని అభిరుచితో గడపాలని ఉద్బోధించారు. సమృద్ధి మాత్రమే విజయానికి హామీ ఇవ్వదని, వనరులు ఉన్నవారు కూడా ప్రతిరోజూ ఎదుగుతూ, సమాజ సంక్షేమానికి దోహదపడాలి కాబట్టి, వ్యక్తిగత ఎదుగుదల జీవితాంతం అవసరమని, నేర్చుకోవడం ఎప్పటికీ ఆపరాదని చెప్పారు. తన తండ్రి టీ దుకాణంలో పని చేసేటప్పుడు ఇతరులతో మసలే పద్ధతిని నేర్చుకున్నానని, నిరంతర అభ్యాసం, వ్యక్తిత్వాన్ని మెరుగుపరుచుకోవడం ఎంత కీలకమో అర్థం చేసుకున్నానని చెప్పారు. చాలా మంది ప్రజలు పెద్ద లక్ష్యాలను నిర్దేశించుకుని, అవి విఫలమైనప్పుడు నిరాశకు గురవుతారని అంటూ, ఏదో ఒక గుర్తింపు కోసం పాకులాడకుండా ఏదైనా పనిని గొప్పగా చేయడంపైనే దృష్టి పెట్టాలని సలహా ఇచ్చారు. ఇటువంటి దృక్కోణం నిరంతర సాధన, లక్ష్యాల వైపు పురోగమించడంలో సహాయపడుతుందన్నారు. మనకు దక్కేదానికన్నా ఇతరులకు ఇవ్వడంలోనే సిసలైన తృప్తి ఉంటుందని, యువత పరులకు సహాయం, సేవలపై దృష్టి కేంద్రీకరించాలని చెప్పారు.

ఆయనను హిమాలయాలకు వెళ్లడాన్ని గురించి అడిగినప్పుడు, శ్రీ మోదీ ఒక చిన్న పట్టణంలో తాను పెరిగిన సంగతిని తెలిపారు. అక్కడ సమష్టి జీవనానికి పెద్దపీట వేశారన్నారు. తాను తరచు స్థానిక గ్రంథాలయానికి వెళ్లేవాడినని, స్వామి వివేకానంద, ఛత్రపతి శివాజీ మహారాజ్ వంటి వారిని గురించి పుస్తకాలలో చదివి ప్రేరణను పొందేవాడినన్నారు. ఇది తన జీవనాన్ని కూడా అదే ప్రకారంగా మలచుకోవాలన్న అభిలాషను కలిగించిందనీ, తాను తన శారీరక పరిమితులు, మనోనిబ్బరం ఏ స్థాయిలో ఉన్నాయో తెలుసుకోవడానికి ఆరుబయట చల్లని వాతావరణంలో పడుకునేవాడిననీ చెప్పారు. స్వామి వివేకానంద బోధనలు తనపై కలగజేసిన ప్రభావాన్ని ఆయన వివరించారు. అనారోగ్యం పాలబడ్డ తన తల్లికి సహాయం చేయాల్సిన అవసరం వివేకానందకు ఉన్నప్పటికీ ధ్యాన సమయంలో కాళీమాతను ఏమయినా అడగడానికీ నోరు కదపలేక పోయిన అనుభవాన్ని గురించి శ్రీ మోదీ ప్రధానంగా ప్రస్తావించారు. ఈ అనుభూతే తరువాత తరువాత వివేకానందునిలో ఎదుటి వారికి ఇవ్వాలన్న భావనకు అంకురార్పణ చేసింది. ఈ ఘట్టం తనను ప్రభావితుడిని చేసిందని శ్రీ మోదీ అన్నారు. సిసలైన సంతృప్తి అనేది ఇవ్వడం నుంచి, ఇతరులకు సేవ చేయడం నుంచే కలుగుతుందని స్పష్టం చేశారు. కుటుంబంలో పెళ్లి జరిగిన వేళ, తాను ఒక సాధువు బాగోగులు చూసుకోవడానికి వెనుకపట్టునే ఉండిపోవాలని నిర్ణయించుకొన్న సందర్భాన్ని ఆయన గుర్తుకు తెచ్చుకొన్నారు. ఈ ఘటన ఆధ్యాత్మిక కార్యకలాపాల పట్ల మొదట్లో తాను ఎలా మొగ్గిందీ చెబుతోంది. సైనికులు తన ఊరికి రావడం చూసినప్పుడు దేశానికి సేవ చేయాలన్న ప్రేరణ తనలో కలిగిందని, అయితే ఆ సమయంలో అందుకు ఏం చేయాలో తనకు స్పష్టంగా తెలియలేదన్నారు. జీవనానికి అర్థం ఏమిటో కనుక్కోవాలన్న ప్రగాఢ కోర్కె తనకు కలిగి, దీనిని అన్వేషించడానికి తాను... యాత్రను మొదలుపెట్టానని ప్రధాని చెప్పారు. స్వామి ఆత్మస్థానందజీ వంటి సాధువులతో సాన్నిహిత్యాన్ని ఏర్పరుచుకోవడాన్ని, ఆ స్వామిజీయే సమాజ సేవ ప్రాముఖ్యాన్ని గురించి తనకు చెప్పి, మార్గదర్శనం చేశారన్నారు. మిషన్‌లో తాను గడిపిన కాలంలో, ప్రముఖ సాధువులతో భేటీ అయినట్లు, వారు వారి ప్రేమను, ఆశీస్సులను తనపై కురిపించినట్లు శ్రీ మోదీ చెప్పారు. హిమాలయాలలో ఉండగా లభించిన ఏకాంతం, తాపసులతో తాను మాట్లాడడం.. ఇవి తనను తాను తీర్చిదిద్దుకోవడానికి, తన అంతర్గత శక్తిని తాను గుర్తించడానికి తోడ్పడ్డాయని శ్రీ మోదీ అన్నారు. వ్యక్తిగతంగా తాను ఎదగడంలో ధ్యానం, సేవ, భక్తి.. వీటి పాత్ర ఎంతో ఉందన్నారు.

రామకృష్ణ మిషన్‌లో స్వామి ఆత్మస్థానందజీతో తనకు ఎదురైన అనుభవాన్ని శ్రీ మోదీ పంచుకొంటూ, దీని కారణంగానే తాను ప్రతి స్థాయిలో సేవే ప్రధానమైన జీవనాన్ని గడపాలని నిర్ణయించుకొన్నానన్నారు. ఇతరులు తననను ప్రధానిగానో, లేదా ముఖ్యమంత్రిగానో చూస్తే చూడవచ్చు కానీ తాను ఆధ్యాత్మిక సిద్ధాంతాలకు పూర్తిగా కట్టుబడి ఉన్నానన్నారు. తన అంతర్గత స్థిరత్వం ఇతరులకు సేవ చేయడంలో ఇమిడి ఉందని, అది పిల్లలను సంరక్షించడంలో మాతృమూర్తికి సాయపడే రూపంలో కావచ్చు, లేదా హిమాలయాల్లో సంచరించడం కావచ్చు, లేదా తన ప్రస్తుత బాధ్యతాయుత పదవిలో పనిచేయడం కావచ్చు.. వీటి అన్నింటిలోనూ అది ప్రతిబింబిస్తుందని శ్రీ మోదీ అన్నారు. తన దృష్టిలో, ఒక సాధువుకు ఒక నేతకు మధ్య ఎలాంటి వాస్తవమైన వ్యత్యాసం లేదని, ఎందుకంటే ఈ రెండు పాత్రలకు సమానమైన విలువల మార్గదర్శనం లభిస్తుందన్నారు. దుస్తులు, చేసే పని వంటి బయటకు కనిపించే దృష్టికోణాలు మారితే మారవచ్చు గాని సేవ చేయాలన్న అంకితభావం మాత్రం మారదని ఆయన స్పష్టం చేశారు. ప్రతి బాధ్యతను తాను శాంతంగా, ఏకాగ్రతతో, అంకితభావంతో నెరవేరుస్తానని ఆయన చెప్పారు.

తొలి రోజుల్లో తనపై రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) చూపిన ప్రభావాన్ని చర్చిస్తూ, దేశభక్తిపూరిత గేయాలంటే తనకు చిన్నప్పటి నుంచీ ఎంతో మక్కువ ఉండేదని, ముఖ్యంగా మకోషి అనే అతను ఒక డప్పు తీసుకుని తమ ఊరికి వచ్చి పాడే పాటలు తనకు బాగా నచ్చేవన్నారు. ఆ పాటలు తనను ఎంతగానో ప్రభావితం చేశాయని, అవే తరువాత తరువాత ఆర్‌ఎస్‌ఎస్‌తో తాను అనుబంధాన్ని ఏర్పరుచుకోవడంలో అవి ప్రభావాన్ని చూపించాయని ఆయన అన్నారు. ఏ పనిని అయినా సరే.. అది చదువుకోవడం, లేదా వ్యాయామం చేయడం, లేదా దేశం కోసం పాటుపడడం.. ఇలా ఏదయినా, ఒక ప్రయోజనం ఉండే పని చేయాలనే కీలక విలువల్ని తనలో పాదుగొల్పింది ఆర్‌ఎస్‌ఎస్ అని ఆయన వివరించారు. జీవనంలో ఒక పరమార్థంతో ముందుకు సాగడానికి ఆర్‌ఎస్‌ఎస్ ఒక స్పష్టమైన దిశను అందిస్తుందని శ్రీ మోదీ వ్యాఖ్యానించారు. ప్రజలకు సేవ చేయడం అంటే అది దైవానికి సేవ చేయడంతో సమానం అని ఆయన స్పష్టం చేశారు. ఆర్‌ఎస్‌ఎస్ 100వ వార్షికోత్సవానికి చేరువ అవుతోందని, ప్రపంచవ్యాప్తంగా లక్షల కొద్దీ స్వయంసేవకులున్న భారీ సంస్థ అని ఆయన తెలిపారు. ఆర్‌ఎస్‌ఎస్ ప్రేరణగా నిలవడంతో, అనేక కార్యక్రమాలు కొనసాగుతున్నాయి.. ఉదాహరణకు సేవా భారతి మురికివాడల్లో, 1,25,000కు పైచిలుకు సేవాపథకాలను ప్రభుత్వ సహాయం లేకుండానే నడుపుతోందని శ్రీ మోదీ వెల్లడించారు. వన్‌వాసీ కల్యాణ్ ఆశ్రమ్ గిరిజన ప్రాంతాల్లో 70,000కు పైగా ఏకోపాధ్యాయ పాఠశాలలను ఏర్పాటు చేసిందని కూడా శ్రీ మోదీ చెప్పారు. విద్యాభారతి సుమారు 25,000 పాఠశాలలను నిర్వహిస్తూ 30 లక్షలమంది విద్యార్థులకు చదువు చెబుతోందని తెలిపారు. విద్యకు, విలువలకు ఆర్‌ఎస్‌ఎస్ పెద్దపీట వేస్తుందని, విద్యార్థులు నేల విడచి సాముచేయకుండా, సమాజానికో గుదిబండలా మారకుండా ఉండటానికి నైపుణ్యాలను నేర్చుకొనేటట్లు శ్రద్ధ తీసుకొంటుందని ఆయన స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా లక్షల సంఖ్యలో సభ్యులు ఉన్న భారతీయ మజ్దూర్ సంఘ్ సాంప్రదాయక కార్మిక ఉద్యమాలకు భిన్నంగా “కార్మికులు ప్రపంచాన్ని ఏకం చేయాల”నే విషయంపై దృష్టిని సారించి, ఒక విశిష్ట దృక్పథాన్ని అవలంబిస్తోందని ఆయన అన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ నుంచి తాను పొందిన జీవన విలువలు, ప్రయోజనాలతోపాటు స్వామి ఆత్మస్థానంద వంటి సాధువుల నుంచి అందుకొన్న ఆధ్యాత్మిక మార్గదర్శకత్వానికిగాను ప్రధాని తన కృతజ్ఞతలను తెలియజేశారు.

భారత్ గురించి శ్రీ మోదీ మాట్లాడుతూ భారత్‌కంటూ ఒక సాంస్కృతిక గుర్తింపు ఉందని, భారత్ నాగరికత వేల సంవత్సరాల నాటిదన్నారు. వందకు పైగా భాషలు, వేల కొద్దీ మాండలికాలతో విలసిల్లుతున్న భారత్ సువిశాలత్వాన్ని ఆయన ప్రధానంగా చాటిచెబుతూ, ప్రతి ఇరవై మైళ్లకు భాష, ఆచారాలు, వంట పద్ధతులు, వస్త్రధారణ మారిపోతూ ఉంటాయని, ఇంతటి వైవిధ్యం నెలకొన్నప్పటికీ ఈ దేశాన్ని ఒక ఉమ్మడి బంధం కలిపి ఉంచుతోందన్నారు. భగవాన్ రాముని కథలు భారత్ నలుమూలల ప్రతిధ్వనిస్తుంటాయి, భగవాన్ రాముని ప్రేరణతో ప్రతి ప్రాంతంలోనూ వ్యక్తులకు పేర్లు పెట్టుకోవడాన్ని గమనించవచ్చన్నారు. గుజరాత్‌లో రాంభాయి అని ఉంటే, తమిళ నాడులో రామచంద్రన్ అని, మహారాష్ట్రలో రాం భావూ అనే పేరు చలామణిలో ఉంటాయని వివరించారు. ఈ అద్వితీయ సాంస్కృతిక బంధమే ఇండియాను ఒకే నాగరికతగా పెనవేస్తోందని ఆయన అభివర్ణించారు. స్నానమాచరించే సమయంలో, దేశంలో అన్ని నదుల పేర్లను స్మరించుకొనే ఆచారమంటూ ఉందని, ప్రజలు ఆ వేళ గంగ, యమున, గోదావరి, సరస్వతి, నర్మద, సింధు, కావేరీ అంటూ నదుల నామాలను ఉచ్చరిస్తారన్నారు. భారతీయ సంప్రదాయాల్లో ఈ ఏకత్వ భావన లోతుగా పాతుకుపోయిందని, ముఖ్య కార్యక్రమాలు, అనుష్ఠానాలలో చెప్పుకొనే సంకల్పాలలో ఈ భావన ప్రతిబింబిస్తూ ఉంటుందని ఆయన అన్నారు. వీటిని చారిత్రక రికార్డుల్లా కూడా భావించవచ్చన్నారు. జంబుద్వీపం మొదలు కులదేవత పేరు చెప్పుకొనేదాకా కార్యక్రమాలలో విశ్వమంతటికీ ఆహ్వానం పలికే సంప్రదాయాలకు భారతీయ ధార్మిక గ్రంథాలు అత్యంత సావధానపూర్వకంగా మార్గదర్శనం వహిస్తూ వచ్చాయని, ఈ ఆచారాలు సజీవంగా నిలిచి నేటికీ వీటిని దేశంలో నిత్యం ఆచరిస్తున్నారన్నారు. పశ్చిమ, ప్రపంచ నమూనాలు దేశాలను పరిపాలన వ్యవస్థలుగానే చూస్తుంటే, భారత్‌లో ఏకత్వం దాని సాంస్కృతిక బంధాలలో ఒక దండగా రూపుదాల్చిందన్నారు. భారత్‌లో చరిత్ర పొడవునా విభిన్న పాలక వ్యవస్థలంటూ మనుగడ సాగించాయని, కానీ దీని ఏకత్వం సాంస్కృతిక సంప్రదాయాల మాధ్యమం ద్వారా చెక్కుచెదరకుండా ఉందన్నారు. భారతదేశం ఏకత్వాన్ని నిలబెట్టడంలో తీర్థయాత్ర సంప్రదాయాలు పోషించిన పాత్ర ఎంతో ఉందని కూడా శ్రీ మోదీ స్పష్టం చేశారు. శంకరాచార్యులు నాలుగు తీర్థ స్థలాలను నెలకొల్పారని ప్రధాని పేర్కొన్నారు. నేటికీ లక్షల మంది తీర్థయాత్రలకు వెళ్తూ ఉన్నారు. రామేశ్వరం నుంచి కాశీకి, కాశీ నుంచి రామేశ్వరానికి జలాన్ని తీసుకువస్తుంటారని తెలిపారు. భారతదేశ క్యాలెండర్‌ను చూస్తే చాలు... దేశంలో విభిన్న సంప్రదాయాలు ఎంత సమృద్ధంగా ఉన్నదీ తెలిసిపోతుందని ఆయన అన్నారు.

గాంధీ మహాత్ముని వారసత్వం, స్వాతంత్ర్యం కోసం భారత్ పోరాడిన తీరును ప్రధానమంత్రి చర్చిస్తూ– మహాత్మాగాంధీ మాదిరిగా– తాను గుజరాత్‌లో పుట్టానని, తన మాతృభాష కూడా గుజరాతీయేనని వివరించారు. గాంధీకి ఒక న్యాయవాదిగా విదేశాల్లో అవకాశాలకు కొదవ లేకపోయినప్పటికీ, కర్తవ్య పరాయణత్వం, కుటుంబ విలువల పట్ల మక్కువ.. ఇవి ఆయనకు మార్గదర్శనం చేయగా ఆయన తన జీవనాన్ని భారతదేశ ప్రజలకు సేవ చేయడానికే అంకితం చేయాలని సంకల్పించుకొన్నారని శ్రీ మోదీ అన్నారు. గాంధీ సిద్ధాంతాలు, చేతలు ఈ నాటికీ భారత్‌లో ప్రతి ఒక్కరినీ ప్రభావితం చేస్తూనే ఉన్నాయని ఆయన స్పష్టం చేశారు. స్వచ్ఛత ముఖ్యమని గాంధీ చెబుతూ వచ్చారు... ఆయన దీనిని స్వయంగా ఆచరించి చూపెట్టారు. అంతేకాదు ఆయన పాల్గొన్న చర్చలలో కూడా స్వచ్ఛతకు ప్రాధాన్యాన్ని ఇచ్చారని శ్రీ మోదీ అన్నారు. భారత్ స్వాతంత్ర్యాన్ని సాధించుకోవడం కోసం దీర్ఘకాలం పోరాడిందని, ఆ కాలంలో వలసవాద పాలన వందల సంవత్సరాల తరబడి కొనసాగినా స్వాతంత్ర్య జ్వాల దేశవ్యాప్తంగా ఉజ్వలంగా మండుతూ వచ్చిందన్నారు. లక్షల కొద్దీ జనం వారి ప్రాణాలను త్యాగం చేశారు. జైళ్లలో మగ్గారు. అమరత్వాన్ని పొందారనీ శ్రీ మోదీ గుర్తు చేశారు. అనేక మంది స్వాతంత్ర్యయోధులు శాశ్వత ప్రభావాన్ని కలగజేసినా, మహాత్మాగాంధీ సత్యంపై ఆధారపడ్డ ఒక భారీ జనాందోళనకు సారథ్యం వహించి జాతిని మేల్కొలిపారని శ్రీ మోదీ చెప్పారు. ప్రతి ఒక్క వ్యక్తినీ స్వాతంత్ర్య సమరంలో పాలుపంచుకొనేటట్లు చేయగలిగిన దక్షత గాంధీలో ఉంది.. వీధిని ఊడ్చి శుభ్రపరిచే పారిశుధ్య కార్మికులు మొదలు ఉపాధ్యాయులు, నేతకారులు, సంరక్షకులు.. ఇలా ప్రతి సాధారణ పౌరులను స్వాతంత్ర్య సాధన కోసం సైనికులుగా గాంధీ మార్చివేశారు. అలా ఒక ఉద్యమాన్ని పెద్ద ఎత్తున నిర్మించారు. బ్రిటిషు వారు దీనిని పూర్తి స్థాయిలో అర్థం చేసుకోలేకపోయారని శ్రీ మోదీ వ్యాఖ్యానించారు. దండి సత్యాగ్రహానికున్న ప్రాధాన్యం ఎంతటిదో.. ఒక చిటికెడు ఉప్పు ఎలా మహోద్ధృత విప్లవ జ్వాలను రగిలించివేసిందో ఆయన వివరించారు. కొల్లాయి కట్టుకొని రౌండ్‌టేబుల్ సమావేశానికి గాంధీ వెళ్లి బకింగ్‌హామ్ రాజమహలులో కింగ్ జార్జ్‌తో భేటీ అయిన ఉదంతాన్ని ప్రధానమంత్రి పంచుకొన్నారు. “మీ రాజు మన ఇద్దరికీ సరిపోయేటంత దుస్తులను ధరించి ఉన్నారు” అంటూ గాంధీ జీ సమయస్ఫూర్తిగా మాట్లాడి, తన హాస్య చతురతను వెల్లడించారని ప్రధాని అన్నారు. అంతా ఐకమత్యంతో ఉండాలని, ప్రజలకున్న శక్తిని చాటాలని గాంధీ పిలుపునివ్వడాన్ని గురించి శ్రీ మోదీ చెబుతూ, ఈ నినాదం ఈనాటికీ మార్మోగుతూనే ఉందన్నారు. ప్రతి ఒక్క కార్యక్రమంలోనూ సామాన్య మానవుడిని భాగస్వామిని చేయాలని, పూర్తిగా ప్రభుత్వంపైనే ఆధారపడి ఉండటానికి బదులు సామాజిక మార్పును ప్రోత్సహించాలనే తన స్వీయ నిబద్ధతను ప్రధాని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

నేటి కాలమాన పరిస్థితుల్లోనూ మహాత్మా గాంధీ ఔచిత్యాన్ని ప్రస్తావిస్తూ– ఆయన వారసత్వం కాలాన్ని జయించిందని శ్రీ మోదీ స్పష్టంచేశారు. ఈ సందర్భంగా తన కర్తవ్య నిబద్ధతను గుర్తుచేస్తూ– తన ధైర్యం తన పేరుతో కాకుండా 140 కోట్ల మంది దేశవాసుల మద్దతు, అనాదిగా వస్తున్న వేల ఏళ్ల సంస్కృతి–వారసత్వాలతో ముడిపడి ఉన్నదని వివరించారు. “నేనొక ప్రపంచ నాయకుడితో కరచాలనం చేస్తున్నానంటే, అది మోదీ ఒక్కడు కాదు... 140 కోట్ల మంది భారతీయులు చేయి కలుపుతున్నారని అర్థం'' అని సవినయంగా పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికలకు ముందు 2013లో తనను ప్రధానమంత్రి అభ్యర్థిగా పార్టీ ప్రకటించినప్పుడు తలెత్తిన విస్తృత విమర్శలను గుర్తుచేస్తూ– భారత విదేశాంగ విధానం, ప్రపంచ భౌగోళిక–రాజకీయ స్థితిగతులపై తన అవగాహనను వారు ప్రశ్నించారని శ్రీ మోదీ పేర్కొన్నారు. ఆ సమయంలో తన స్పందనను వివరిస్తూ– “భారత్ తనను చిన్నచూపు చూడటాన్ని ఎన్నడూ అనుమతించదు... ఎవరినీ ఎప్పుడూ చిన్నచూపు చూడదు. ఇతర ప్రపంచ దేశాలకు దీటుగా నిలుస్తుంది” అని చెప్పానన్నారు. ఈ విశ్వాసమే తన విదేశాంగ విధానానికి కీలకమని పునరుద్ఘాటిస్తూ– దేశమే సదా ప్రధానమని స్పష్టం చేశారు. ప్రపంచ శాంతి, సౌభ్రాత్రాలకు భారత్ ప్రాధాన్యం ‘వసుధైవ కుటుంబకం’ అనే దృక్పథంలో అనాదిగా వేళ్లూనుకున్నదని ప్రధానమంత్రి గుర్తుచేశారు. పునరుత్పాదక ఇంధనం దిశగా “ఒకే సూర్యుడు–ఒక ప్రపంచం–ఒక గ్రిడ్” సహా సకల జీవజాలానికీ వర్తించే “ఒకే ప్రపంచం–ఒకే ఆరోగ్యం” వంటి ప్రపంచ ఆరోగ్య సంరక్షణ దాకా అంతర్జాతీయంగా అనేక కార్యక్రమాల్లో భారత్ పోషిస్తున్న పాత్రను ఆయన ప్రస్తావించారు. ఈ నేపథ్యంలో ప్రపంచ సౌభాగ్యం ఇనుమడింపజేయాల్సిన బాధ్యతను స్పష్టం చేస్తూ, ఈ దిశగా అంతర్జాతీయ సమాజం సమష్టి కృషికి నడుం బిగించాలని పిలుపునిచ్చారు. ఇక “ఒకే భూమి–ఒకే కుటుంబం–ఒకే భవిష్యత్తు” నినాదంతో భారత్ జి–20 శిఖరాగ్ర సదస్సును నిర్వహించడాన్ని ప్రస్తావిస్తూ– భారత ప్రాచీన విజ్ఞానాన్ని ప్రపంచంతో పంచుకోవాల్సిన బాధ్యతను నిర్వర్తించిందని శ్రీ మోదీ గుర్తుచేశారు.

# చదువుతో జీవితంలో ఉన్నత స్థానాలకు : ఇన్‌చార్జి ఎంఈఓ అంబటి అంజయ్య



నల్గొండ, మార్చి 18:నల్లగొండ జిల్లా కట్టంగూరు ఉన్నత పాఠశాలలో మంగళవారం 10వ తరగతి విద్యార్థుల వీడ్కోల సమావేశం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఇన్‌చార్జి ఎంఈఓ అంబటి అంజయ్య పాల్గొని మాట్లాడారు. ప్రతి వ్యక్తి జీవితంలో అభివృద్ధి సాధించాలంటే చదువు ఒక్కటే మార్గమని, కష్టంతో ఇష్టపడి చదివిన వారు ఉన్నత స్థానాలను అధిరోహిస్తారన్నారు. ఉన్నత చదువులు చదవడానికి పదో తరగతి కీలకమని విద్యార్థులు పట్టుదలతో పరీక్షలు రాసి నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు.

విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి పాఠశాలకు, కుటుంబ సభ్యులకు మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పాఠశాలలో తమ జ్ఞాపకాలను ఉపన్యాసాల ద్వారా తెలియజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మహాలక్ష్మి, ఆంథోని, సునంద, విఠల్ కుమార్, గఫూర్ పాల్గొన్నారు.

# ప్రజలు తిరగబడతారనే పోలీసుల పహారాలో శంకుస్థాపనలు : జక్కిడి రఘువీర్ రెడ్డి



హైదరాబాద్, మార్చి 18: ప్రజలు తిరగబడతారన్న భయంతోనే కాలనీలకు ఒంటరిగా వెళ్లలేక పోలీసుల పహారాలో బిజెపి కార్పొరేటర్ కొప్పుల నరసింహారెడ్డి శంకుస్థాపనలు చేస్తున్నాడని ఎల్బీనగర్ నియోజకవర్గం బిఆర్ఎస్ నాయకుడు జక్కిడి రఘువీర్ రెడ్డి ఆరోపించారు.

మన్సురాబాద్ డివిజన్ సెంట్రల్ బ్యాంక్ కాలనీలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 12న ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి శంకుస్థాపనలు చేసిన అభివృద్ధి పనులను తిరిగి మళ్లీ శంకుస్థాపనలు చేసేందుకు వచ్చిన కార్పొరేటర్ ని ప్రశ్నించేందుకు వెళ్లిన బీఆర్ఎస్ కార్యకర్తలను గంజాయి బ్యాచులంటూ ఆరోపణలు చేశాడన్నారు. గంజాయి బ్యాచులు, బ్రోతల్ హౌస్ నిర్వాహకులు, గ్యాంబ్లింగ్ ఆట నిర్వాహకులంతా బిజెపి కార్పొరేటర్ ప్రధాన అనుచరులేనన్న విషయం ఆయన గుర్తుంచుకొని మాట్లాడితే బాగుంటుందని తెలిపారు. కార్పొరేటర్ అనుచరులపైనే ఇలాంటి కేసులు ఉన్నాయని త్వరలో వాటన్నిటి ఆధారాలను బయటపెడతామని హెచ్చరించారు.

ఇంటిముందు ఇటుక, ఇసుక పడితే ప్రజలను పీడించుకుతింటున్న కార్పోరేటర్ పిఏల బాగోతాన్ని త్వరలో బయటపెడతానన్నారు. శంకుస్థాపనలు చేసిన పనులకు తిరిగి శంకుస్థాపనలు చేసేందుకు వచ్చిన వారిలో మన్సురాబాద్ డివిజన్‌కు చెందిన బిఆర్ఎస్ కార్యకర్తలు మాత్రమే ఉన్నారని.. అదే కార్పొరేటర్ 10 సంవత్సరాల క్రితం నుంచి తన వద్ద పనిచేసి మానేసిన డ్రైవర్లను పిలిపించుకున్నాడని ఆరోపించారు. ప్రజాబలం, కార్యకర్తల బలం లేకనే రౌడీమూకలను, అడ్డమీద కూలీలను పిలిపించుకొని డివిజన్లో కుటిల రాజకీయాలకు పాల్పడుతున్నాడని ఆరోపించాడు.

పోలీసు పహారాల్లో తిరిగే కార్పొరేటర్ ప్రజలకు ఏమి న్యాయం చేస్తాడని ప్రశ్నించాడు. కార్పొరేటర్ నరసింహారెడ్డి కాలం చెల్లి పోయిందని మూడు నెలల్లో పదవి ఊడుతుందన్నారు. బిజెపి పార్టీ నుంచి కార్పొరేటర్‌గా గెలిచిన కొప్పుల నరసింహారెడ్డి కాంగ్రెస్ పార్టీతో కుమ్మక్కై చేస్తున్న రాజకీయాలు ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. పొద్దున బిజెపి కండువా వేసుకొని తిరిగే నీవు సాయంత్రం అయితే కాంగ్రెస్ పార్టీ నేత మధుయాష్కీ గౌడ్ ఇంటికి వెళ్లి మంతనాలు సాగిస్తున్నది వాస్తవం కాదా అని ఆయన ప్రశ్నించారు. మనసురాబాద్ లో బిజెపిని బొంద పెట్టి కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు కార్పొరేటర్ కొప్పుల నరసింహారెడ్డి రంగం సిద్ధం చేసుకున్నాడని ఆరోపించారు. ఎల్బీనగర్ నియోజకవర్గంలో మధుయాష్కీ టూరిస్టుల తయారయ్యాడని, నియోజకవర్గం అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీకి ఆయన చేసింది ఏమీ లేదంటూ ఎద్దేవా చేశారు. చిన్న చెరువు తాము కబ్జా చేశామని మధుయాష్కీ ఆరోపణలు చేశాడని.. ఈ విషయంపై ఎలాంటి విచారణకైనా సిద్ధమేననీ.. సర్వేనెంబర్ 93తో పాటు, చిన్న చెరువు పరిసరాల్లోని భూములపైన సర్వే చేయించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సతీష్ కుమార్, రామాచారి, అఖిల్ యాదవ్, నరి లింగం, సాయి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# యాదగిరీశుడిని దర్శించుకున్న మిస్ యూనివర్స్



యాదగిరిగుట్ట, మార్చి 18 : మిస్ యూనివర్స్ విక్టోరియా క్జేర్ థీల్విగ్ యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి వారిని మంగళవారం దర్శించుకున్నారు. ఆమెను ఆలయ అధికారులు సాదరంగా స్వాగతించారు. పూజారులు ఆశీర్వచనం అందించారు. ఆలయ కార్యనిర్వాహక అధికారి (ఈవో) భాస్కర్ రావు ఆమె సందర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు.

దర్శనం తర్వాత విక్టోరియా క్జేర్ థీల్విగ్‌కు స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. సందర్శన సమయంలో ఆమె ఆలయ ప్రాముఖ్యత, సంప్రదాయాలు, చారిత్రక నేపథ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. ఆలయ ప్రాముఖ్యత గురించి ఈవో భాస్కర్ రావు ఆమెకు వివరించారు.

విక్టోరియా క్జేర్ థీల్విగ్ కూడా అఖండ దీపారాధనలో పాల్గొన్నారు. సందర్శకుల పుస్తకంలో తన భావాలను వ్యక్తపరుస్తూ, ఈ అనుభవాన్ని “వర్ణించలేనిది” ఆమె అభివర్ణించారు.

